యాసంగి సాగుకు రేపటి నుంచి నిజాంసాగర్ నీటి విడుదల

- నీటిని వృథా చేయొద్దు : ప్రాజెక్టు ఏఈఈ శివ

నవతెలంగాణ-నిజాంసాగర్

యాసంగి పంటల సాగు కోసం 14వ తేదీ (శుక్రవారం) నుంచి నిజాంసాగర్ ప్రాజెక్టు నీటిని విడుదల చేయనున్నట్టు ప్రాజెక్ట్ ఏఈఈ శివ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులందరూ కూడా నీటిని పొదుపుగా వాడుకోవాలని, నీటిని వృథాగా పోనివ్వొద్దని పేర్కొన్నారు. ప్రతిరోజు 1600 క్యూసెక్కుల చొప్పున 15 రోజులపాటు నీటిని విడుదల చేస్తామని, ఆరు విడుతలలో మొత్తం 11 టీఎంసీల నీటిని పంటల సాగుకోసం విడుదల చేయనున్నట్టు తెలిపారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 17.802 టీఎంసీలు కాగా ప్రస్తుతం 17.629 టీఎంసీల నీరు నిల్వ ఉందని ఆయన తెలిపారు. ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేస్తున్నందున నిజాంసాగర్ ప్రధాన కాలువ పరిసరాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కాలువలో ఎవరు దిగొద్దని సూచించారు.

ఇందిరమ్మ ఇండ్లకు సర్వే

- సిబ్బందికి వివరాలు అందజేయండి : కలెక్టర్

నవతెలంగాణ-కామారెడ్డి

ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల కొరకు దరఖాస్తు చేసుకున్న వారు, మీ ఇంటివద్దకు ఇందిరమ్మ ఇళ్ల సర్వే చేయుటకు గాను సర్వేయర్ మీ ఇంటివద్దకు వచ్చినపుడు పలు వివరాలు అందుబాటులో ఉంచుకోవాలని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. రేషన్ కార్డు (ఆహార భద్రత కార్డు), ఆధార్ కార్డు, కరెంటు బిల్లు, ఇంటిపన్ను రసీదు, పట్టా పాస్ బుక్కు, భూమి యాజమాన్య పత్రం, పోజిషన్ సర్టిఫికెట్, ఇళ్ల ఇంటి యజమానురాలి పేరు మీద మంజూరు చేయనున్నట్టు తెలిపారు. వారి ఫోటో కూడా తీసుకుంటారని, కావున ఇంటి యజమానురాలు తప్పక ఉండాలని సూచించారు. ఇళ్ల నిర్మాణం 400 స్క్వేర్ ఫీట్‌కి తక్కువ కాకుండా నిర్మించాలని, దీనికి గాను ప్రభుత్వం రూ.5 లక్షల లబ్ధిదారురాలి బ్యాంకు ఖాతాలో విడతల వారీగా జమచేయనున్నట్టు తెలిపారు.

గ్రూప్-2 అభ్యర్థులు నిబంధనలు పాటించాలి

- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్
- 15,16 తేదీల్లో పరీక్షలు



నవతెలంగాణ-కామారెడ్డి

నిబంధనలు పాటిస్తూ అభ్యర్థులు గ్రూప్-2 పరీక్షలకు హాజరు కావాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. అభ్యర్థులకు పరీక్ష కేంద్రాలకు సెల్ ఫోన్, ఇతర ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్ అనుమతి లేదని, గ్రూప్ 2 పరీక్షల నేపథ్యంలో అభ్యర్థులకు పలు సూచనలు జారీచేసిన చేయడం జరిగిందన్నారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్దేశించిన నిబంధనలను పాటిస్తూ అభ్యర్థులు ప్రశాంతంగా గ్రూప్-2 పరీక్షలకు హాజరు కావాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 15, 16 న ఉదయం 10 గంటల నుంచి 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి 5.30 వరకు రెండు సెషన్లు గ్రూప్ 2 పరీక్షలు జరుగుతాయని, అభ్యర్థులకు అవసరమైన మేర పరీక్షా కేంద్రాలను సిద్ధం చేశామని, డిసెంబర్ 9 నుంచి అభ్యర్థులు తమ హాల్ టికెట్లను డౌన్లోడ్ చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. కామారెడ్డి పట్టణంలో 19 కేంద్రాల్లో 8085 మంది అభ్యర్థులు గ్రూప్ 2 పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు. పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులను ఉదయం సెషన్ లో 8.30 నుంచి, మధ్యాహ్నం సెషన్ లో 1.30 నుంచి అనుమతించనున్నట్టు తెలిపారు. పరీక్ష కేంద్రాల గేటు ఉదయం 9.30 గంటలకు, మధ్యాహ్నం 2.30 గంటలకు మూసి వేస్తామని, దీని తర్వాత పరీక్ష కేంద్రాలకు ఎవరిని అనుమతించడం జరగదని, అభ్యర్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని కలెక్టర్ కోరారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు తమ వెంట బ్లూ, బ్లాక్ పాయింట్ పెన్నులు, ఫోటోతో కూడిన హాల్ టికెట్, ప్రభుత్వం చేజారి చేసిన ఒరిజినల్ ఫోటోతో కూడిన ఐడెంటిటీ ప్రూఫ్ తీసుకుని రావాలని, హాల్ టికెట్ పై పాస్పోర్ట్ సైజ్ ఫోటో ముద్రించి తీసుకుని రావాలని, ఒకే హాల్ టికెట్‌ను పరీక్ష మొత్తం వినియోగించాలని తెలిపారు. హాల్ టికెట్‌లో ఫోటో సరిగ్గా లేకపోతే అభ్యర్థి 3 పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు గెజిటెడ్ అధికారి లేదా చివర చదివిన విద్యాసంస్థ ప్రిన్సిపల్ సంతకంతో తీసుకువచ్చి పరీక్షా హాల్లో ఇన్విజిలేటర్‌కు అప్పగించాలని సూచించారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి ఒక రోజు ముందు వచ్చి చూసుకోవాలని కలెక్టర్ సూచించారు. చెప్పులు మాత్రమే వేసుకుని రావాలని షూస్ వేసుకోవద్దని, సెల్ఫోన్ బ్లూటూత్ ఇతర ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ అభ్యర్థులు తీసుకువచ్చినట్లైతే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటూ అభ్యర్థిని ఇన్వాలిడేషన్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు. మోడల్ ఓ.ఎం.ఆర్ షీట్ల ను వెబ్ సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని సరిగ్గా బబుల్స్ చేయడం ప్రాక్టీస్ చేయాలని, ఓ.ఎం.ఆర్ షీట్ ను సరిగా చెక్ చేసుకోవాలని, పరీక్ష ముగిసే వరకు అభ్యర్థులు పరీక్షా హాల్ ను విడిచి వెళ్లడానికి వీలులేదని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు. 190 మంది దివ్యాంగ అభ్యర్థులకు పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో వింగ్ ఏ, బి గదులను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అంధులు, పరీక్ష స్వయంగా రాయలేని వారికి 23 మంది సహాయకులుగా (స్క్రైబ్స్) నియమించినట్టు తెలిపారు. అలాంటి అభ్యర్థులు సదరం సర్టిఫికెట్, అపెండిక్ - 3 తప్పనిసరిగా చీఫ్ సూపరింటెండెంట్‌లకు చూపించాలని తెలిపారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మె ఎఫెక్ట్..

మూగబోయిన విద్యాబోధన

- పాఠాలు బోధించే వారు లేక కేజీబీవీల్లో ఆడుకుంటున్న విద్యార్థులు
- సిబ్బంది లేక ఎంఈవో కార్యాలయానికి తాళం
- ప్రభుత్వం స్పందించి ఉద్యోగుల డిమాండ్‌లు నెరవేర్చాలని కోరుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు





బోధన్ మండలం అమ్దాపూర్ కేజీబీవీలో ఉన్న అటెండర్, స్వీపర్.. ఎంఈవో కార్యాలయానికి తాళం.. వివరాలు సేకరిస్తున్న ఎంఈవో

నవతెలంగాణ-బోధన్

విద్యాశాఖలో ముఖ్యమైన పనులన్నీ ఎస్ఎస్ఏ ఉద్యోగులు చేస్తుంటారు. ఉపాధ్యాయులకు సంబంధించిన వివరాల నమోదు, విద్యార్థుల వివరాలు, మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన పనులు ఈ ఉద్యోగులు చేపడతారు. గత 18 సంవత్సరాలుగా చాలీ చాలని వేతనాలతో పని చేస్తున్నా ఇప్పటికీ ఉద్యోగ భద్రత లేకుండా పోయిందని, వేతనాలు పెరగడం లేదని పలుమార్లు ఉన్నతాధికారులకు ప్రజాప్రతినిధులకు విన్నవిస్తూనే ఉన్నారు. అయినా ప్రభుత్వం సరిగా పట్టించుకోలేదు. దీంతో తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ సర్వశిక్ష అభియాన్ (ఎస్ఎస్ఏ) ఉద్యోగులు సమ్మెకు దిగడంతో విద్యాశాఖ మూగబోయినట్లయింది. ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకుందామని గత నాలుగు రోజులుగా నిరవధిక సమ్మెకు పూనుకున్నారు.

కేజీబీవీలో నిలిచిన విద్యాబోధన

బోధన్ నియోజకవర్గంలో ఎడపల్లి, బోధన్, రెంజల్, నవీపేట్ మండలాల్లో కేజీబీవీ పాఠశాలలో ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మెతో విద్యాబోధన పూర్తిగా నిలిచిపోయింది. ఉపాధ్యాయులందరూ నిజామాబాద్‌లో జరుగుతున్న సమ్మె శిబిరానికి వెళ్లిపోవడంతో కేజీబీవీలో విద్యార్థుల చదువు ప్రశ్నార్థకంగా మారింది. బుధవారం నవతెలంగాణ విలేకరి బోధన్ మండలం అమ్దాపూర్ కేజీబీవీని పరిశీలించగా అటెండ్, స్వీపర్ మాత్రమే విధులలో ఉన్నారు. టీచర్లు లేక విద్యార్థులు ఆడుకునేవారు ఆడుకుంటున్నారు. చదువుకునే వారు చదువుకుంటున్నారు. ఇదే పరిస్థితి ప్రతి కేజీబీవీలో నెలకొంది.

ఎంఈఓ కార్యాలయానికి తాళమే

ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మెతో మండల విద్యాశాఖ అధికారుల కార్యాలయాలు మూతపడ్డాయి. కార్యాల యంలో పనిచేసే సీఆర్పీలు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు సమ్మెలో ఉండడంతో కార్యాలయం వెలవెలబోయింది. కార్యాలయం చెత్త చెదారంతో కళావిహీనంగా తయారయింది. సీఆర్పీలు విధులలో లేక కాంప్లెక్స్ పరిధిల పాఠశాలల పనులు నిలిచిపోయాయి. ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతూ పనులు చేసుకునే పరిస్థితి తలెత్తింది.

సమ్మెలో అన్ని విభాగాల ఉద్యోగులు

నిజామాబాద్ జిల్లాలోని 896 మంది ఉద్యోగులు సమ్మె చేపడుతున్నారు. డీఈవో, ఎంఈవో కార్యాలయాలు, కేజీబీవీ, భవిత, ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్నా ఉద్యోగులు సమ్మెలో పాల్గొనడంతో విద్యాశాఖ మూగబోయినట్లయింది. నిజామాబాద్ జిల్లాలో కేజీబీవీ ఉద్యోగులు 571 మంది యుఆర్ ఎస్ సిబ్బంది పదిమంది డిపిఓ సిబ్బంది 9 మంది ఎంఐఎస్ కోఆర్డినేటర్లు 22 మంది సిసిఓలు 29 మంది సిఆర్పిలు 94 మంది ఐఈఆర్పిలు 35 మంది మెసెంజర్లు 19 మంది పిటిఐలు 88 మంది సిజీవీలు 19 మంది ఇలా 896 మంది ఉద్యోగులు సమ్మెలో పాల్గొంటున్నారు. ప్రభుత్వం తక్షణమే వారి న్యాయమై డిమాండ్లు పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

ఇతర రాష్ట్రాల తరహాలో పర్మినెంట్ చేయాలి

రాజు. ఎస్ఎస్ఏ జిల్లా జేఏసీ అధ్యక్షులు

దేశంలో ఇతర రాష్ట్రాల్లోని ప్రభుత్వాలు ఎస్ఎస్ఏ ఉద్యోగుల సేవలను గుర్తించి పర్మినెంట్ చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం ఈ దిశగా అడుగులు వేయాలి. సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఎస్ఎస్ఏ కాంట్రాక్టు ఉద్యోగులందరికీ యథాస్థానంలో పర్మినెంట్ చేస్తూ బేషరతుగా ఉత్తర్వులు జారీ చేయాలి. ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను అమలు చేసే వరకు సమ్మె విరమించే ప్రసక్తి లేదు .ఏళ్ల తరబడి చాలిచాలని వేతనంతో వెట్టి చాకిరి చేస్తున్న పట్టించుకునే నాధుడే లేరు. కావున సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి తక్షణమే తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరారు.

నగరంలో ఫ్లెక్సీల కలకలం

- రాత్రికిరాత్రే ఏర్పాటు, తొలగింపు



హనుమాన్ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

'అధికారుల కబంధ హస్తాల్లో పర్యాటక రంగం ఉందని, త్వరలో అన్ని వివరాలతో మీ ముందుకు' అంటూ నగరంలోని పలు కూడళ్లల్లో రాత్రికి రాత్రి ఫ్లెక్సీలు ఏర్పాటు అయ్యాయి. అనంతరం వాటిని తొలగించారు. వీటి ఏర్పాటు పై జిల్లాలో సర్వత్ర చర్చనీయాంశం అయింది. నిజామాబాద్ జిల్లాలో చెప్పుకోదగిన స్థాయిలో టూరిజమే లేనప్పుడు ఈ ఫ్లెక్సీల ఏర్పాటు వెనుక మతలబు ఏమిటి? అనే ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి. ఎవరో ప్రయివేటు వ్యక్తులు అధికారులను బ్లాక్ మెయిల్ చేసేందుకే ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినట్టు పలు అనుమానాలు తావిస్తున్నాయి.

జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో గల ఓ రిసార్ట్‌లో గతంలో గొడవలు జరగడంతో పోలీసులకు ఫిర్యాదు అందడంతో దానిని మూసివేయించినట్టు సమాచారం. దాన్ని తిరిగి తెరిపించేందుకు సంబంధిత యజమాని ప్రయత్నించినప్పటికీ గతంలో ఉన్న పోలీస్ బాస్ ఒప్పుకోలేనట్టు సమాచారం. దీంతో పలువిధాలుగా ప్రయత్నం చేసి చివరకు ఫ్లెక్సీ ఏర్పాటు చేసినట్టు వినికిడి. అధికారులను బ్లాక్ మెయిల్ చేసే ఉద్దేశంతో ఏర్పాటు చేసినట్టుగా ఉందని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

ఉపాధిలో కోట్లాది రూపాయల అవినీతి

- జుక్కల్ ప్రజావేదికతో వెలుగులోకి
- బయటకు పొక్కనీయకుండా అధికారుల యత్నాలు



సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తున్న అధికారులు

నవతెలంగాణ-జుక్కల్

మండలం వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో నిర్వహించిన ఉపాధి పనులపై జుక్కల్ మండల కేంద్రంలో ప్రజావేదిక సోమవారం నిర్వహించారు. ఉపాధి గ్రామస్థాయి ఎస్ఆర్‌పిడి, ఆర్‌పి అధికారులు పాల్గొన్నారు. కాగా ఈ ప్రజావేదికలో కోట్లాది రూపాయల అవకతవకలు చోటుచేసుకున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. ఈ సందర్భంగా మండల కేంద్రంలో నిర్వహించిన మండల ప్రజావేదికలో 2023-24 సంవత్సరానికి సంబంధించిన మండల ప్రజా వేదికలో గ్రామాల వారిగా జిల్లా డిఆర్డిఏ లెక్కలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాలలో నిర్వహించిన ఉపాధి పనులలో సుమారుగా 6 కోట్ల 78 లక్షల రూపాయలు అవినీతి జరిగినట్టు లెక్కలు చెబుతున్నాయి. మండల ఉపాధి హామీ సిబ్బంది జిల్లా అధికారులకు మచ్చగా చేసుకొని మండల ఉపాధి హామీ సిబ్బంది అధికారులు ఇట్టి విషయాన్ని బయట పొక్కనియకుండా గోప్యంగా ఉంచు తున్నారు. అవినీతి కి పాల్పడ్డ మాజీ రాజకీయ నాయకులు ఉపాధి హామీ అధికారులతో కుమ్మక్కై అవినీతికి పాల్పడినట్టు మండల వాసులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. జిల్లాస్థాయి అధికారులు మండల స్థాయి అధికారులు కలిసి ఇటు మీడియాకు తప్పుదోవ పట్టిస్తున్నారు. ఇట్టి విషయాన్ని రహస్యంగా ఉంచుతూ ప్రజావేదిక నిర్వహించి మండల ప్రజలకు ఎటువంటి విషయాలు తెలియనీయకుండా కప్పిపుచ్చేందుకు ప్రయత్నించారు. ఇట్టి విషయంలో అధికారులు విఫలం కావడంతో ప్రజలు ఆందోళన చెందుతు న్నారు. 2023-24 నిర్వహించిన లెక్కల ప్రకారం మూడు కోట్ల 68 లక్షల రూపాయలు వివిధ రకాల పనులు చేసినట్టు లెక్కలలో చూపించారని ఇట్టి విషయాన్ని రహస్యంగా ఉంచి ఉన్నత అధికారులకు కూడా మచ్చిక చేసుకుని సమాచారం బయటకు రాకుండా జాగ్రత్త వహించారని మండల ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా గ్రామాలలో పనులు చేస్తున్న ఎఫ్ఏలు టిఏల ఏపీవోలు సీసీలు అందరూ కలిసి ఈ పనులకు చూసి చూడకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం తో ఈ అవినీతికి ఆద్యం పోసినట్టయింది. పనులు జరగకుండానే జరిగినట్టు చూ యించి డబ్బులు డ్రా చేశారని సమా చారం. ప్రజా వేదికలో నిర్వహించిన లెక్కలను ఉన్నత జిల్లా అధికారులు ఇప్పటికీ బయటకు తెలియనియకపోవ డంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

మౌనం దాల్చిన మండల అధికారులు..

ప్రజా వేదికలో ఉపాధి హామీలో కోట్లాది రూపాయల అవినీతి జరిగినట్టు అధికారులు గుర్తించినా విషయాన్ని మండల అధికారులకు తెలిసిన మౌనం వహించడం పట్ల అనేక సందేహాలకు తావిస్తుంది. వాస్తవానికి జిల్లా అధికారులు ప్రజావేదికలో ఇచ్చిన నివేదికలను మండల అధకారులకు మీడియాకు ఖచ్చితంగా సమాచారం ఇవ్వాల్సి ఉండగా పట్టించుకోకుండా ఇలా చేయడం మండల ప్రజలందరికీ విస్మయానికి గురి అవుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రజావేదికలో వెలుగులోకి వచ్చిన అవకతకవలను తెలియపరచాలని, నిధుల కొల్లగొట్టిన వారి నుంచి రికవరీ చేయించాలని మండల వాసులు డిమాండ్ చేస్తున్నారు.

బోధన్‌లో ఆల్ప్రాజోమ్ పట్టివేత



నిందితులను అదుపులోకి తీసుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

నవతెలంగాణ-బోధన్

మహారాష్ట్ర నుంచి తెలంగాణ ప్రాంతానికి తరలిస్తున్న అల్ప్రాజోమ్‌ను బుధవారం స్టేట్ టాస్క్ ఫోర్స్ పోలీసులు నిఘావేసి పట్టుకున్నారు. మహారాష్ట్ర నుంచి కొంతమంది వ్యక్తులు 4.3 కిలోల అల్ప్రాజోమ్‌ను తరలిస్తుండగా బోధన్ పట్టణంలో స్టేట్ టాస్క్ ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. దీని విలువ సుమారు 40 లక్షల రూపాయలు ఉంటుందని బోధన్ ఎక్సైజ్ సీఐ పవన్ గౌడ్ తెలిపారు. ప్రస్తుతం స్టేట్ టాస్క్ ఫోర్స్ బోధన్‌లోని స్థానిక ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లో పట్టుబడిన మత్తు పదార్థాలను పూర్తి నిర్ధారణ అనంతరం స్థానిక ఎక్సైజ్ పోలీసులకు అప్పగించినట్లు తెలిసింది.

నాగుల్‌గావ్‌జీపీలో అవకతవకలపై కలెక్టర్‌కు రిపోర్ట్ అందజేసిన సీసీఆర్



రిపోర్ట్ అందజేస్తున్న సభ్యులు

నవతెలంగాణ-కామారెడ్డి

జుక్కల్ మండలంలోని నాగుల్‌గావ్ గ్రామపంచాయతీలో అవకతవకలు చోటుచేసుకున్నాయని, వాటికి సంబంధించిన రిపోర్ట్‌ను కలెక్టర్‌కు అందజేసినట్టు కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ (సీసీఆర్) నార్త్ జోన్ ఇంచార్జి కరీమోద్దీన్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో మాట్లాడుతూ.. గ్రామస్తుల ఫిర్యాదుతో రికార్డు వెరిఫికేషన్ నిర్వహించినట్టు తెలిపారు. తాము జరిపిన తనిఖీలలో అనేక లోటుపాట్లు కనిపించాయని, నాగుల్ గావ్ గ్రామపంచాయతీలో ఉండాల్సిన రిజిస్టర్లలో సగం కంటే ఎక్కువ రిజిస్టర్లు లేవని పంచాయతీ సెక్రటరీ రాతపూర్వకంగా సమాధానం ఇచ్చినట్టు తెలిపారు. లభించిన రిజిస్టర్లలో అనేక తప్పులు క్షుణంగా పరిశీలించినట్టు తెలిపారు. సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) ద్వారా గత 10 సంవత్సరాల రికార్డులను పరిశీలించాలని కోరినా, కేవలం 3-4 సంవత్సరాల రికార్డులు మాత్రమే లభించాయన్నారు. పైగా లభించిన రిజిస్టర్ల నిర్వహణ సరిగ్గా లేవు. ఈ వివరాల ఆధారంగా డ్రాఫ్టింగ్ కమిటీ సభ్యులు ఫైనల్ రిపోర్ట్ రూపొందించి బుధవారం కామారెడ్డి జిల్లా కలెక్టర్, డిపిఓ లకు అందజేసినట్టు తెలిపారు. ఎక్కడైనా అవకతవకలు గమనించినపుడు, ఎవరైనా కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్‌ను సంప్రదిస్తే వారికి తమ సంస్థ నుండి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని, సంస్థ ద్వారా ఆర్టీఐ చట్టానికి సంబంధించి పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమం లో నార్త్ జోన్ సిరిసిల్ల ఇంచార్జి రత్నాకర్, కామారెడ్డి జిల్లా ఇంచార్జి శ్రావణ్ కుమార్, సీ సి ఆర్ సభ్యులు వసంత్ పాటిల్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

వజ్రఖండి రైస్‌మిల్లులో ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు

నవతెలంగాణ-జుక్కల్

మండలం లోని వజ్రఖండి గ్రామం సమీపంలో ఉన్న ఓ రైస్ మిల్లులో విజిలెన్స్ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహిం చారు. ఈ సందర్భంగా తప్పుడు లెక్కలు, పొరపాట్లను గుర్తిం చారు. ఈ సందర్భంగా రైస్ మిల్లులో గత రెండు సంవత్సరాలుగా నిర్వహిస్తున్న లెక్కలలో పలు తేడాలున్నాయని కోట్లాది రూపాయల వ్యాపారాలు చేసినప్పటికీ అధికారికంగా తప్పుడు లెక్కలు చూపించి మిగతా వాటిని బ్లాక్ మనీగా ఉపయోగించినట్టు సమాచారం. ఈ విషయమై ఫిర్యాదు చేయడంతో జుక్కల్ ఎస్ఐ భువనేశ్వర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె ఉధృతం



నినాదాలు చేస్తున్న సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగులు

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లాలో సమగ్ర శిక్ష ఉద్యోగులు మున్సిపల్ ఆఫీస్ వద్ద నిర్వహిస్తున్న సమ్మె కొనసాగుతుంది. నాలుగు రోజుల నిరసన దీక్షలకు అధికారులు రాష్ట్ర నాయకులతో చర్చలు విఫలం కావడంతో రెండవ రోజు సమ్మె మరింత ఉధృతంగా మారిందని సమగ్ర శిక్ష ఉద్యోగుల జిల్లా అధ్యక్షులు సత్యనారాయణ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా వనరుల కేంద్రం తాళాలు పడ్డాయని, సమగ్ర శిక్ష ఉద్యోగులు సమ్మెలో పాల్గొనడం వలన కేజీబీవీలో విద్యాబోధన ఆగిపోయినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ రెడ్డి, శ్యాం కుమార్, సంఘం జిల్లా జనరల్ సెక్రెటరీ సంపత్, నాయకులు శ్రీధర్ కుమార్, రాములు, సంతోష్ రెడ్డి, శిల్ప, లావణ్య, సాయిలు, శైలజా, మాధవి , అజీద్, శ్రీనివాస్, రమేష్, కాళిదాసు, కృష్ణ, శ్రీకాంత్, బన్సీలాల్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

మార్గదర్శకాలకనుగుణంగా సర్వే

- అదనపు కలెక్టర్ వి విక్టర్



సర్వే తీరు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

నవతెలంగాణ-రామారెడ్డి

ప్రభుత్వ మార్గదర్శకాలు అనగుణంగా ఇందిరమ్మ ఇండ్ల సర్వేలు నిర్వహించాలని అదనపు కలెక్టర్ (రెవిన్యూ) వి విక్టర్ సూచించారు. మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇండ్ల సర్వేను ఆయన పరిశీలించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, భోజనం చేశారు. నాణ్యమైన భోజనాన్ని అందించాలని నిర్వాహకులకు సూచించారు. ఆయన వెంట ఎమ్మార్వో సువర్ణ, ఎంపీడీవో తిరుపతిరెడ్డి, తదితరులు ఉన్నారు.

సైన్స్‌ఫెయిర్‌లో రాష్ట్ర స్థాయికి ఎంపికైన ఘన్‌పూర్ విద్యార్థులు



ప్రశంసాపత్రాలు అందుకుంటున్న విద్యార్థులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

డిచ్ పల్లి మండల కేంద్రంలోని ఘనపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు సైన్స్‌ఫెయిర్‌లో రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆనంద్ బుధవారం తెలిపారు. పాఠశాలకు చెందిన నవనీత్, రాము వీరిద్దరూ పిల్లలనుఆస్పత్రులనుంచి ఎత్తుకెళ్లకుండా యాంటీ తెఫ్ట్ ప్రదర్శన చేసినట్టు తెలిపారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితులకు అనుగుణంగా ఉందని అందుకే వీరు రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు వివరించారు. వీరు ఎంపిక కావడానికి గైడ్ ధనలక్ష్మి (ఉపాధ్యాయురాలు) కృషి చాలా ఉందని వారన్నారు. విద్యార్థులు ఇంకా మున్ముందు జాతీయ స్థాయికి ఎదగడానికి పాఠశాల అధ్యాపక బృందం ప్రత్యేకంగా కృషి చేస్తామని తెలిపారు. అనంతరం విద్యార్థులను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

30 అంశాలపై తీర్మానం

- మున్సిపల్ సాధారణ సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ కార్యాలయంలో చైర్ పర్సన్ వన్నెల్ దేవి లావణ్య అయ్యప్ప శ్రీనివాస్ అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించారు. 30 ఎజెండా అంశాలపై కౌన్సిల్ సభ్యులతో ఏకగ్రీవ తీర్మానం చేశామని తెలిపారు. అందరి సహకారంతో మున్సిపాలిటీని అభివృద్ధి చేసుకుందామని అన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మున్ను, కమిషనర్ రాజు కౌన్సిలర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అధికారులు

26న సీపీఐ ఆవిర్భావ దినోత్సవం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

26న సిపిఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గ్రామ, గ్రామాన ఉత్సవాలు నిర్వహిద్దామని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అన్నారు. బుధవారం సిపిఐ జిల్లా కార్యాలయంలో ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిపిఐ 1925 డిసెంబర్ 26లో నిర్వహించి నాడు సంపూర్ణ స్వాతంత్రం కొరకు జరిగిన పోరాటంలో అనేకమంది త్యాగాలు చేసిన వీర చరిత్ర కమ్యూనిస్టు పార్టీ దేనని అన్నారు. నేటి వరకు ప్రజా, కార్మిక సమస్యలపై రాజీలేని పోరాటాలు నిర్వహిస్తున్నామన్నారు. 26న గ్రామ, గ్రామాన పార్టీ జెండాలను ఆవిష్కరించి, ఉత్సవాలను నిర్వహించాల్సిందిగా పార్టీ నాయకులను, కార్యకర్తలను జిల్లా కౌన్సిల్ పక్షాన కోరుతున్నామని తెలిపారు. ప్రెస్‌మీట్‌లో సిపిఐ నగర కార్యదర్శి వై.ఓమయ్య, నాయకులు సఖి సురేష్, ఇమ్రాన్ అలీ, భాను, సత్యం, లింగం, సాయిలు, పాల్గొన్నారు.

ముగ్గురు ఎస్ఐల బదిలీలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ముగ్గురు ఎస్సైలను బదిలీ చేస్తూ ఇన్‌చార్జి డీఐజీ చంద్రశేఖర్ రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. బాసర జోన్-2 పరిధిలో మొత్తం 24 మంది ఎస్సైలను బదిలీ చేశారు. కమిషనరేట్ పరిధిలోని నందిపేట ఎస్‌హెచ్‌వో హరిబాబాను వీఆర్‌కు బదిలీ చేశారు. ఆర్మూర్ ఎస్సై -1 గోవింద్‌ను సైతం వీఆర్ కు బదిలీ చేసినప్పటికీ ఆర్మూర్ పీఎస్‌కు అటాచ్ చేశారు. వేల్పూర్ ఎస్సై నాగనాథ్‌ను ఆదిలాబాద్ వీఆర్‌కు బదిలీ చేశారు. అలాగే ఆదిలాబాద్ వీఆర్‌లో ఉన్న సిలివేరి మహేశ్‌కు ఆర్మూర్ ఎస్సై-1 గా పోస్టింగ్ ఇవ్వగా, నందిపేట్, వేల్పూర్ ఎస్‌హెచ్‌వోలుగా ఎవరినీ నియమించలేదు.

తెలంగాణ రాష్ట్ర ఒలంపిక్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా ఈగ సంజీవరెడ్డి

నవతెలంగాణ-మోపాల్



తెలంగాణ ఒలంపిక్ అసోసియేషన్ ఎన్నికల ఫలితాలను బుధవారం ప్రకటించారు. ఎన్నికలు జరిగిన తర్వాత కోర్టు ఆదేశానుసారం ఎన్నికల ఫలితాలను నిలిపివేశారు. కోర్టు ఆదేశానుసారం బుధవారం ఓట్లు లెక్కింపు జరుపగా మాజీ పార్లమెంట్ సభ్యుడు జితేందర్ రెడ్డి ప్యానల్ ఘన విజయం సాధించింది. ఈ ప్యానల్లో నిజామాబాద్ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు ఈగ సంజీవరెడ్డి రాష్ట్ర ఒలంపిక్ అసోసియేషన్ ఉపాధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే ఈసీ సభ్యులుగా కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు అంద్యాల లింగన్న కూడా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లాకు చెందిన ఇద్దరు ఏకగ్రీవంగా రాష్ట్ర ఒలంపిక్ సంఘంలో ఎంపిక కావడం పట్ల జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ సంఘం, జిల్లాకు చెందిన క్రీడా సంఘాల బాధ్యులు హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా పెద్దమ్మ అలయ వార్షికోత్సవం


బోనాలతో వస్తున్న గ్రామస్తులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్ వాయి మండలంలోని యెల్లారెడ్డిపల్లి గ్రామ పరిధిలోని ధర్పల్లి-ఇందల్ వాయి రహదారిపై ఉన్న పెద్దమ్మ ఆలయం 21వ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా అభిషేకం, అర్చనలు, కళ్యాణం, బోనాల ఊరేగింపు, అన్న సత్రం నిర్వహించినట్లు అలయ కమిటీ అధ్యక్షుడు బొడ్డు రవి తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ వార్షికోత్సవంలో భాగంగా గ్రామం నుండి ఆలయం వరకు బోనాలను డప్పు వాయిద్యాలతో ఊరేగిస్తామని, వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుండి భారీ సంఖ్యలో ప్రజలు భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేసినట్లు తెలిపారు. అలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గత కొన్ని రోజులుగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది ఎలాంటి లోటు పాట్లు లేకుండా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆర్.సాయిలు, పి నడ్పి సాయిలు, గంగాధర్, సాగర్, మల్లయ్య, సునీల్, రజనికాంత్, నరేష్, సాయినాథ్, లక్ష్మణ్, సతీష్, రాములు, చుట్టుపక్కల గ్రామాలకు చెందిన నాయకులు, ముదిరాజ్ సంఘం సభ్యులు, మహిళలు యువకులు పాల్గొన్నారు.

కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను సందర్శించిన ఎంపీడీవో


భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను ఎంపీడీవో వెంకటేష్ జాదవ్, సూపరింటెండెంట్ శ్రీనివాస్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని రికార్డులను పరిశీలించిన అనంతరం వంటకాలను పరిశీలించారు. ప్రభుత్వం మెస్ చార్జీలను గణనీయంగా పెంచడం వల్ల బాలికలకు పౌష్టిక ఆహారాన్ని అందించాలని వంట కార్మికులకు ఆదేశించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు తాగునీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని ఆయన సిబ్బందికి సూచించారు. చిన్నారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు, తాజా కూరగాయలను వండి పెట్టాలని ఆయన అన్నారు. విద్యార్థులు భోజనం చేసే సమయంలో ఆయన అక్కడే ఉండి వంటకాల గురించి బాలికలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శిల్ప, స్వప్న, వంట కార్మికులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన నియోజకవర్గ కాంగ్రెస్ ఇంఛార్జి

నవతెలంగాణ-ఆర్మూర్



రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమాం రెడ్డిని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బుధవారం కలిశారు. ఈ సందర్భంగా నియోజక వర్గానికి సంబంధించిన లిఫ్ట్ ఇరిగేషన్‌ల గురించి మంత్రికి నిధులు విడుదల చేయాలని కోరారు.

జీవన వికాసానికి గణితం చాలా ముఖ్యం

- జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జీవన వికాసానికి గణితం చాలా ముఖ్యమైనదని ఆ గణితాన్ని పిల్లలు అత్యంత ఇష్టంతో నేర్చుకోవాలని జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి అన్నారు. నగరం లోని న్యూ అంబేద్కర్ భవన్లో తెలంగాణ గణిత ఫోరం నిజామాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి గణిత ప్రతిభా పరీక్ష పోటీలను రెండు దశల్లో నిర్వహించి నట్లు జిల్లా అధ్యక్షులు టి. కృష్ణ తెలిపారు.. మొదటి దశలో జిల్లా విద్యాశాఖాధికారి అశోక్ ప్రతిభా పరీక్ష ప్రశ్నాపత్రాలను విడుదల చేశారు. తదనంతరం ప్రతిభా పరీక్ష పోటీ నిర్వహించారు. రెండవ దశలో రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థుల ఫలితాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన నిజామాబాద్ జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి మాట్లాడుతూ.. మానవ జీవన వికాసానికి గణితం చాలా ముఖ్యమైనదని, ఆ గణితాన్ని పిల్లలు అత్యంత ఇష్టంతో నేర్చుకోవాలని సూచించారు జిల్లా గ్రంథాలయం సంస్థ పక్షాన అన్ని పాఠశాలల పిల్లలందరికీ అవసరమయ్యే గణిత పుస్తకాలను ఉచితంగా అందిస్తామని తెలిపారు. గౌరవ అతిథి జిల్లా విద్యాశాఖ అధికారి పార్శీ అశోక్ మాట్లాడుతూ.. గణితం చాలా సులువైన సబ్జెక్ట్ అని, తార్కికమైన ఆలోచనను పెంచుతుందని, ఏ ఉద్యోగానికైనా రాసే పోటీ పరీక్షల్లో గణితం తప్పకుండా ఉంటుందని అన్నారు. చిన్న వయసు నుండే గణితాన్ని శ్రద్ధాసక్తులతో నేర్చుకోవాలని పిల్లలకు సూచన చేశారు. గురుకృప ఫౌండేషన్ వారు ఎన్నుకున్న ఐదుగురు ఉత్తమ గణిత ఉపాధ్యాయులకు గణితరత్న పురస్కారంతో సన్మానం చేశారు. పోటీ పరీక్షల ఫలితాలను విడుదల చేసి రాష్ట్రస్థాయికి ఎంపికైన పిల్లలను అభినందించి వారికి బహుమతులను ప్రధానం చేశారు. కార్యక్రమంలో నిజామాబాద్ నార్త్ సౌత్ మండలాల విద్యాధికారులు ఆర్వీఎన్ గౌడ్, సాయరెడ్డి, గణిత ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి గంట అశోక్, వ్యవస్థాపక అధ్యక్షులు ధారా చంద్రశేఖర్, గౌరవాధ్యక్షులు కాంతారావు ఆర్గనైజింగ్ సెక్రటరీ గోపాలకృష్ణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్, మైఖేల్ పురస్కార గ్రహీతలు ప్రధానోపాధ్యాయులు రమేష్, గణితఉపాధ్యాయులు వెంకటేశ్వర రెడ్డి, ఎం.సాయిలు, జిల్లా కార్యవర్గ సభ్యులు సివిఆర్ నారాయణ, జి రమేష్, పరమేశ్వర్, కే రమేష్, వీరేందర్ రెడ్డి, గైడ్ టీచర్లు, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి

ఆర్‌కెఆర్ అపార్ట్మెంట్ వాసులకు న్యాయం చేయాలి

- మెయిన్ గేట్ ముందు ధర్నా
- బూతులు తిడుతూ గొడవకొచ్చిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలి
- మాలసంఘం నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఆర్‌కెఆర్ అపార్ట్మెంట్ వాసులకు న్యాయం చేయాలని కోరుతూ బైపాస్ రోడ్‌లగల ఆర్ కె ఆర్ అపార్ట్మెంట్ వాసులతోపాటు మాల సంఘం నాయకులు బుధవారం మెయిన్ గేట్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అపార్ట్మెంట్ వాసులు గోపి, మాల సంఘం నాయకులు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎమ్మెల్సీ కవిత మామ రామ్ కిషన్ రావుతోపాటు ఆయన అనుచరులు మళ్లీ కబ్జాలకు తెరలేపారన్నారు. ఏకంగా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మామే కబ్జాలకు పాల్పడుతున్నాడంటూ నిజామాబాద్ జిల్లా రూరల్ పోలీస్ స్టేషన్లో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారని తెలిపారు. ఆర్‌కెఆర్ అపార్ట్మెంట్‌లో సుమారు నాలుగైదు సంవత్సరాల క్రితం ప్లాట్లను కొనుగోలు చేసి ఉంటున్నామన్నారు. కొనుగోలు చేసే సమయంలో ఎలాంటి విషయాలు చెప్పకుండా ఇప్పుడు ఒక గేటు నుండే వెళ్లాలంటే మంగళవారం సాయంత్రం నుండి ఇబ్బందులకు గురిచేస్తూ గేటును మూసేందుకు రామ్ కిషన్ రావు అనుచరులు ప్రయత్నించారని ఆవేదన వ్యక్తం చేశారు. అపార్ట్మెంట్ వాసుల తరఫున వెళ్లి అడిగేందుకు ప్రయత్నిస్తే గోపి అనే వ్యక్తిని కొట్టేందుకు ప్రయత్నం చేశారని అపార్ట్మెంట్ వాసులు తెలిపారన్నారు. అమ్మేటప్పుడు పక్కనే ఉన్న రామ్ కిషన్ రావు ఇప్పుడు మాట తప్పి ఇలా మనుషులను పంపి భయభ్రాంతులకు గురి చేయడం సరైంది కాదని మండిపడ్డారు. ప్రధాన ద్వారంను కబ్జా చేసేందుకు ప్రయత్నం చేస్తున్న రామ్ కిషన్‌రావుపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని అపార్ట్మెంట్ వాసులు కోరుతున్నారు. తెర వెనుక ఉండి తెర ముందు వేరే వ్యక్తులను పంపుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారని అన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్‌లోగల ఆర్‌కెఆర్ టవర్స్ బిల్డింగ్ ముందున్న రోడ్డుని కబ్జా చేశారని ఆ ప్రాంతంలో ప్లాట్లు చేసి కవిత మామ ఆయన అనుచరులు విక్రయిస్తున్నారని వారు ఆందోళన చెందుతున్నారన్నారు. దీని అడ్డుకునే ప్రయత్నం చేస్తున్న తమపై దళితులని చూడకుండా ఇష్టానుసారంగా దుర్భాషలాడుతూ దాడులకు దిగుతున్నారని మండిపడ్డారు. దీనిపై ప్రభుత్వం, అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని భూమిని కబ్జా కాకుండా చూడాలని, తమపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలని బాధితులు డిమాండ్ చేశారు. రామ్ కిషన్ రావు తోపాటు అనుచరులపై ఎస్సీ ఎస్టీ కింద కేసు నమోదు చేయాలని కోరారు. కార్యక్రమంలో అపార్ట్మెంట్ వాసులతోపాటు మాల సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ధర్నా అనంతరం నేరుగా పోలీస్ స్టేషన్కు వెళ్లి ఫిర్యాదు చేశారు. స్థానిక ఎస్సై అందుబాటులో లేకపోవడంతో ఫిర్యాదును పోలీస్ స్టేషన్లో అందజేసి ఎస్ఐకి ఫోన్లో సమాచారం అందించారు. ఈ విషయమై స్థానిక ఎస్సై ఆరిఫ్‌కు నవ తెలంగాణ విలేకరి ఫోన్ చేసి వివరణ కోరగా బుధవారం ఉదయం గోపి అనే వ్యక్తితో పాటు అపార్ట్మెంట్ వాసులు పోలీస్ స్టేషన్కు వచ్చి ఫిర్యాదు చేశారన్నారు. ఉన్నతాధికారులకు సమాచారం అందించామన్నారు. ప్రస్తుతం అపార్ట్మెంట్ రోడ్డుకు సంబంధించిన విషయంలో ఇరువురిని సంబంధిత పేపర్లు తీసుకొని పోలీస్ స్టేషన్‌కు రావాలని సూచించామన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడతామన్నారు.


మాట్లాడుతున్న మాలసంఘం నాయకులు

డ్రైనేజీలో పడి వ్యక్తి మృతి


మృతి చెందిన శ్రీ రామ లక్ష్మణ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

నగరంలోని నాలుగవ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి డ్రైనేజీలో పడి మృతి చెందాడని నాలుగవ పోలీస్ స్టేషన్ ఎస్ఐ శ్రీకాంత్ బుధవారం తెలిపారు.. కోట గల్లి కి చెందిన శ్రీ రామ లక్ష్మణ్(50) ప్రతిరోజు మద్యం తగడానికి అలవాటు పడ్డాడు. కొన్ని కొన్ని సార్లు ఇంటికి వెళ్లకుండా బయటనే తిరుగుతు ఉండేవాడు. అదేవిదంగా మంగళ వారం సాయంత్రం ఐదు గంటలకు ఇంటి నుంచి బయటకి వెళ్లాడు. బుధవారం చంద్రనగర్ స్మశాన వాటిక పక్కన గల మోరీలో పడి చనిపోయి ఉన్నాడు. అయితే మద్యం తాగి మూత్రం చేయుటకు వెళ్లి ప్రమాదవశాత్తు మోరీలో పడి చనిపోయాడని, ఆయన తల్లి లక్ష్మి ఫిర్యాదుపై కేసు నమోదు చేశామన్నారు. మృతుని భార్య 25 సంవత్సరాల క్రితం ప్రతిరోజు మద్యం తాగేసి వేధిస్తున్నాడని విడిచిపెట్టిందన్నారు. అప్పటినుంచి ఇతను తల్లి శ్రీరామ లక్ష్మీ దగ్గరనే ఉంటున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తికి 3 రోజుల జైలు శిక్ష

నవతెలంగాణ-కంఠేశ్వర్

మద్యం సేవించి వాహనం నడిపిన ఓ వ్యక్తికి మూడు రోజుల జైలు శిక్ష పడిందని నిజామాబాద్ ట్రాఫిక్ సిఐ ప్రసాద్ బుధవారం తెలిపారు.ఈనెల 11న మద్యం సేవించి వాహనాలు నడిపిన 31 మంది వాహనదారులకు ట్రాఫిక్ సిఐ ప్రసాద్ ఆధ్వర్యంలో కౌన్సిలింగ్ నిర్వహించారు. అనంతరం రెండవ మెజిస్ట్రేట్ ముందు హాజరు పరచగా మెజిస్ట్రేట్ నూర్ జహాన్ బేగం 30 మందికి జరిమానా విధించారు. అందులో ఆర్మూర్‌కు చెందిన కోయల్కర్ శ్రీనివాస్ అనే వ్యక్తికి మూడు రోజుల జైలు శిక్ష విధించినట్టు సిఐ తెలిపారు. ఈ సందర్భంగా సిఐ ప్రసాద్ మాట్లాడుతూ.. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వాహనదారులు వాహనాలు నడిపేటప్పుడు మద్యం సేవించి నడపకూడదని పలు సూచనలను తెలియజేశారు. ఒకవేళ మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కావున వాహనదారులు నిబంధనలను అతిక్రమించకుండా పలు జాగ్రత్తలను పాటించాలని తెలియజేశారు.

జిల్లా సమాఖ్య భవన నిర్మాణంకోసం నిధులు మంజూరు

- డీఆర్‌డీఏ పీడీ సాయగౌడ్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జిల్లా సమీకృత కార్యాలయవ సముదాయంలోని డిఆర్డిఎ కార్యాలయంలో జిల్లా సమాఖ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో డిఆర్డిఒ సాయగౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం జిల్లా సమాఖ్య నూతన భవన నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసిందని కలెక్టర్ కూడా నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఈ నూతన జిల్లా సమాఖ్య భవన నిర్మాణానికి ఒక ఎకరం స్థలాన్ని కూడా కేటాయించినట్లు తెలిపారని అన్నారు. ఈ సందర్భంగా తమకు నూతన భవన నిర్మాణం కొరకు స్థలము, నిధులు కేటాయించినందుకు ముఖ్యమంత్రికి, మంత్రి సీతక్క కి, జిల్లా కలెక్టర్ కి కృతజ్ఞతలు తెలిపారు. డిఆర్డిఒ మాట్లాడుతూ మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా సంఘాల్లో లేని వారిని సంఘాల్లో చేర్పించాలని తెలిపారు. కార్యక్రమంలో సంస్థాగత నిర్మాణం, బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, ఫామ్, నాన్ ఫామ్ మండల సమైక్య గ్రామ సమస్యల ఆడిట్ మొదలగు విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో ఎస్ఈఆర్పి అధికారి భారతి, డిపిఎంలు సంధ్యారాణి, సాయిలు, శ్రీనివాస్, మారుతి, శ్రీనిధి ఆర్.ఎం రాందాస్, ఏ.పి.ఎం సరోజిని, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు రాధ, కార్యదర్శి లావణ్య, కోశాధికారి లక్ష్మి మరియు 28 మండల సమాఖ్యల అధ్యక్షులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అధికారులు

జీపీ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలి

- ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ (టియుసిఐ) ఆధ్వర్యంలో డిచ్‌పల్లి ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి, ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టియుసిఐ జిల్లా ప్రధానకార్యదర్శి ఎం. సుధాకర్, జిల్లా నాయకులు బి. మురళి మాట్లాడుతూ...తెలంగాణ రాష్ట్రంలోని 12,741 గ్రామ పంచాయతీలలో సుమారు 50 వేల పైగా మల్టీపర్పస్ వర్కర్స్‌గా విధులు నిర్వహిస్తున్న గ్రామపంచాయతీ వర్కర్లు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు.

ధరలు పెరుగుతున్నా, వేతనాలు పెరగడం లేదన్నారు. జీపీ కార్మికులకు 4 నుండి 6 నెలలగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కనీస వేతనాలను జీవో 11 లేదా 14 ప్రకారం ఇవ్వాలన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన ప్రకారం గ్రామపంచాయతీ వర్కర్లను పర్మినెంట్ చేయాలన్నారు. ఇందిరమ్మ గృహాలు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో జీపీ కార్మికులకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఇన్సూరెన్స్ సౌకర్యం, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ప్రతి నెల శానిటేషన్ వస్తువులు, భద్రతా పరికరాలు ఇవ్వాలన్నారు. ప్రతినెల 5వ తేదీలోపు జీతాలు ఇవ్వాలని, రోజుకు 8 గంటలే పని చేయించాలన్నారు. ప్రతి ఆదివారం సెలవు ఇవ్వాలని, పంచాయతీ సెక్రెటరీ, సర్పంచుల వేధింపులు ఆపాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం వెంటనే కార్యాచరణ రూపొందించాలని, లేనిచో రాష్ట్ర వ్యాప్తంగా గ్రామపంచాయతీ కార్మికులను ఉద్యమ బాట పట్టిస్తామన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు మోహన్, సాయిబాబా జీపీ కార్మికులు రమేష్ గంగాధర్, సాయిలు, గంగారాం, కిషన్, సుజాత, రాజేశ్వర్, నవీన్, సుమన్, శ్రీకాంత్, దుర్గా పోసాని, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నాయకులు

కస్తూర్బా మోడల్ హాస్టల్‌ను తనిఖీ చేసిన అడిషనల్ కలెక్టర్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండల కేంద్రంలోని కస్తూర్బా మోడల్ హాస్టల్‌ను జిల్లా అడిషనల్ కలెక్టర్ అంకిత్ కుమార్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మోడల్ స్కూల్‌లోని హాస్టల్లో భోజనాన్ని పరిశీలించారు. కస్తూర్బా పాఠశాలలోని కూరగాయలు, గుడ్లను పరిశీలించారు. తాగునీరును కూడా పరిశీలించి సూచనలు, సలహాలు పాటించాలని సూచించారు. హాస్టల్లో కిచెన్ స్టోర్ రూమ్‌లను పరిశీలించారు. విద్యార్థులకు పలు జాగ్రత్తలు పాటిస్తూ భోజనం అందించాలని తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో సతీష్ కుమార్, ఎంఈఓ శ్రీనివాస్, ఎంపీఓ యూసుఫ్ ఖాన్ తదితరులు ఉన్నారు.

మోడల్‌స్కూల్ తనిఖీ చేసిన అడిషనల్ కలెక్టర్

ఆర్మూర్ : పట్టణంలోని మోడల్ స్కూల్ ను బుధవా రం స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ అంకిత్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంట గదిలో వండిన ఆహార పదార్థాలను, హాస్టల్లో నిలువ ఉంచిన సరుకులను, తాగు నీటిని పరిశీలించారు. వార్డుల్లో జరుగుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వేను 26వ వార్డులో పరిశీలించారు. ఈ తనిఖీల్లో తహసిల్దార్ గజానన్, మండల అభివృద్ధి అధికారి సాయిరాం, సానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్, వార్డ్ ఆఫీసర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


జక్రాన్‌పల్లి: కస్తూర్బా పాఠశాలలో తనికీ చేస్తున్న అడిషనల్ కలెక్టర్

మోహన్ బాబును వెంటనే అరెస్టు చేయాలి

- జర్నలిస్టుపై దాడిని ఖండించిన ప్రెస్‌క్లబ్


మాట్లాడుతున్న ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు రామకృష్ణ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జర్నలిస్టులపై దాడి చేసిన మోహన్ బాబును వెంటనే అరెస్టు చేయాలని నిజామాబాద్ జిల్లా జర్నలిస్టులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు రామకృష్ణ మాట్లాడుతూ.. మంచు మోహన్ బాబు ఆయన కుటుంబ సమస్యల మీద రాష్ట్రంలో జరుగుతున్న వివాదాల నేపథ్యంలో మీడియా కవరేజ్‌కి వెళ్లిన మీడియా ప్రతి నిధులపై జరిగిన దాడిని నిరసిస్తూ బుధవారం నిజామాబాద్ ప్రెస్ క్లబ్ అండ్ ఎలక్ట్రాన్ మీడియా, ప్రింట్ మీడియా ఆధ్వర్యంలో నిరసన నిర్వహించారు. సమాచారం నిమిత్తం వెళ్లిన జర్నలిస్టుపై నటుడు మోహన్ బాబు దాడి చేయడం అన్నది దారుణం అన్నారు. ఆయన ఒక నటుడు గానే కాకుండా ప్రజాస్వామ్యవాదిగా గతంలో ప్రజాప్రతినిధిగా చేసిన అనుభవం ఉందన్నారు. వ్యక్తిగతంగా దాడి చేయడం అన్నది దారుణం అని అన్నారు. వెంటనే మోహన్ బాబుని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ కమిటీ సభ్యులతోపాటు, ప్రింట్ మీడియా జర్నలిస్టులో, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు, ఫోటో జర్నలిస్ట్, తదితర సంఘాల జర్నలిస్టులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
కామారెడ్డి
గురువారం | డిసెంబర్ 12, 2024 | www.navatelangana.com

కొనసాగుతున్న సీఎం కప్ క్రీడా పోటీలు

నవతెలంగాణ-తాడ్వాయి

జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో కొనసాగుతున్న సీఎం కప్ క్రీడా పోటీల్లో సీనియర్ వాలీబాల్ తాడ్వాయి పరిషత్ పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానం కాగా పల్లెగడ్డతండా ద్వితీయ స్థానం కబడ్డీ పురుషుల విభాగంలో తాడ్వాయి ప్రథమ, కంకల్ ద్వితీయ, కోకో పోటీలో బ్రాహ్మణపల్లి ప్రథమ, కష్ణజివాడి ద్వితీయ స్థానంలో నిలిచాయి. బాలికల విభాగంలో బ్రహ్మజీ వాడి ప్రథమ కష్ణజి వాడి ద్వితీయ స్థాన లో నిలిచాయని ఫిజికల్ డైరెక్టర్ సంగారెడ్డి తెలిపారు. గురువారం అథ్లెటిక్స్ పోటీలు అనంతరం బహుమతుల ప్రదానోత్సవంతో పాటు ముగింపు కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ తహసీల్దార్ రహీముద్దీన్, ఎంపీఓ సవిత రెడ్డి, డిప్యూటీ జగన్నాథం, పిడి ఎస్ నగేష్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి వివరాలు లభ్యం

నవతెలంగాణ-నిజాంసాగర్

మండల కేంద్రంలో నిజాంసాగర్ ప్రాజెక్టు 12వ గేటు వద్ద మృతి చెందిన వ్యక్తి వివరాలు లభ్యమైనట్టు నిజాంసాగర్ ఎస్సై శివ బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడి పేరు పెండ్యాల శివప్రసాద్ తండ్రి పేరు మల్లేష్ వయస్సు (45) అతని గ్రామం సంగారెడ్డి టౌన్ రాజంపేట కాలనీలో నివాసం ఉండేవాడని అతను మెదక్ గవర్నమెంట్ హాస్పిటల్‌లో ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేసేవాడని ఆయన తెలిపారు. మద్యానికి బానిస అవడం వల్ల ఇంట్లో నుంచి ఎవరికి చెప్పకుండా వారం రోజుల క్రితం మండలంలోని అచ్చంపేట గ్రామానికి చెందిన బంధువుల దగ్గరికి వచ్చినట్టు ఆయన పేర్కొన్నారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉండగా మృతుడి భార్య శారద ఫిర్యాదు ఇవ్వగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్టు ఆయన తెలిపారు.

ప్రజాప్రతినిధులే

గ్రంథాలయాలకు పాఠకులను రప్పించాలి

- జిల్లా గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి

నవతెలంగాణ-లింగంపేట్/తాడ్వాయి

పాఠకులకు కోరితే అన్ని రకాల పుస్తకాలు గ్రంథాలయంలో అందుబాటులో ఉంచుతామని జిల్లా గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి తెలిపారు. అయితే గ్రంథాలయాలకు పాఠకులను రప్పించే బాధ్యత ప్రజాప్రతినిధులు తీసుకోవాలని సూచించారు. బుధవారం లింగంపేట్ మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని ఆయన సందర్శించారు. గ్రంథాలయంలో ఏఏ పాఠ్య పుస్తకాలు అందుబాటులో పాఠకులకు ఉన్నాయో గ్రంథ పాలకులను అడిగి తెలుసుకున్నారు. రోజువారి పాఠకుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో రోజుకు 600 మంది పాలకులు వస్తున్నారన్నారు ఇప్పటివరకు 230 మంది వివిధ ఉద్యోగాలు సంపాదించారన్నారు. జిల్లాలో 19 గ్రంథాలయాలు నడుస్తున్నాయని ఆయన అన్నారు. గ్రంథాలయానికి 2 కోట్ల 30 లక్షల రూపాయలు వివిధ గ్రామ పంచాయతీల నుంచి పన్ను రావాల్సి ఉందన్నారు. దాతల సహకారంతో గ్రంథాలయాలు నడుపుతున్నామన్నారు ప్రజా ప్రతినిధులు తమ పిల్లలతో పాటు గ్రామంలోని యువతీ యువకులను గ్రంథాలయానికి పంపించేలా ప్రజాప్రతినిధులు బాధ్యతలు తీసుకోవాలన్నారు.

డిజిటల్ గ్రంథాలయాలు గ్రామీణ గ్రంథాలయాలు ఏర్పాటు చేసి దినపత్రికలు వార పత్రికలతో పాటు పోటీ పరీక్షలకు అన్ని రకాల పాఠ్యపుస్తకాలను అందుబాటులో



లింగంపేట్: మాట్లాడుతున్న జిల్ల గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి



తాడ్వాయి: చైర్మన్‌ను సన్మానించిన ఎంపీడీవో, పలువురు

ఉంచుతున్నామన్నారు. అనంతరం మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో నర్సారెడ్డి రాజు పటేల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బుర్ర నారా గౌడ్, గ్రంథ పాలకులు మల్లారెడ్డి, సిబ్బంది, నాయకులు కౌడ రవి, రాజు, సాయికుమార్, ఖాసీంతో పాటు పాఠకులు ఉన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తా..
సంస్థ చైర్మన్-మద్ది చంద్రకాంత్‌రెడ్డి

తాడ్వాయి : గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తానని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయాన్ని పరిశీలించారు. నిరుద్యోగ యువత కోసం పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని మరేవైనా అవసరముంటే తమకు సమాచారం ఇచ్చినట్లయితే వెంటనే అందిస్తామని తెలిపారు. కలర్, కరెంటు, మూత్రశాల, మరుగుదొడ్ల మరమ్మతులు వారం రోజుల్లో చేయిస్తామన్నారు గ్రంథాలయానికి రావాల్సిన పన్ను మండలంలో సుమారు 12 లక్షలు బకాయి ఉన్నాయని సత్వరమే చెల్లించాలని ఎంపీడీవో సయ్యద్ సాజిద్ ఆలీని ఆదేశించారు. స్పందించిన అధికారి పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడి పెండింగ్ లో ఉన్న బకాయిలను చెల్లించేలా చూస్తామన్నారు. అనంతరం చైర్మన్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జూకంటి వెంకటరెడ్డి ఇన్‌చార్జి ఎంత పాలకుడు రాజలింగం గ్రామాభివృద్ధి అధ్యక్షులు మేకల రాజు మాజీ ఉప సర్పంచ్ సుధాకర్ రావు, మండల పార్టీ ఉపాధ్యక్షులు లక్ష్మణ్ చారి, గై నీశివాజీ, గ్రామ అధ్యక్షులు మెట్టు రామచంద్రం యూత్ అధ్యక్షులు రంజిత్ రెడ్డి మండల యూత్ అధ్యక్షులు అఖిల్ రావు, యూత్ నాయకులు ఏ శ్రీకాంత్ పాఠకులు తదితరులున్నారు.

ఇద్దరిపై గంజాయి కేసు నమోదు

నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండలంలోని నేరేళ్ తండా గ్రామంలో గంజాయి సరఫరా జరుగుతుందని నమ్మదగిన సమాచారం మేరకు రెక్కీ నిర్వహించి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ ఆంజనేయులు బుధవారం తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం.. నమ్మదగిన సమాచారం మేరకు 10వ తేదీనా(మంగళవారం) సాయంత్రం సమయంలో గాంధారి ఎస్ఐ ఆంజనేయులు తన సిబ్బందితో కలిసి నేరేళ్ తండా గ్రామ శివారులో గల బామన్ సజ్జు అనే వ్యక్తి ఇంటి దగ్గర రెక్కీ నిర్వహించారు. ఇంటి వద్దకు అదే గ్రామానికి చెందిన బస్సి ప్రకాష్ అనే వ్యక్తి వచ్చి డబ్బులు ఇచ్చి రెండు చిన్న నల్లని కవర్లలో గంజాయి తీసుకుని ఉంటుడగా రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. వారిని పూర్తిగా విచారించి వారి దగ్గర గల 105 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయిని బామన్ సజ్జు తన ఇంటి ముందు గల ఖాళీ ప్రదేశం నందు పెంచి దాని చుట్టూ ఎవరికి అనుమానం కాకుండా కట్టెలతో కప్పిపెట్టి, అది ఎండిన తర్వాత, అట్టి గంజాయిని అదే గ్రామానికి చెందిన బస్సి ప్రకాష్ ద్వారా చిన్నచిన్న ప్యాకెట్లుగా చేసి గంజాయి తాగే వినియోగదారులకు ఎక్కువ ధరలకు అమ్ముతున్నారని సమాచారం ద్వారా పట్టుకొని వారిద్దరిపైన కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

బాధితులకు ఫోన్‌లు అందజేత

నవతెలంగాణ-గాంధారి



గాంధారి పోలీస్ స్టేషన్ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన నలుగురు వ్యక్తుల ఫోన్‌లు పోగొట్టుకోగా.. ఫిర్యాదు చేయడంతో సెల్ ఫోన్‌లను సిఈఐఆర్ పోర్టల్ ద్వారా గాంధారి పోలీసులు వెతికిపెట్టి బుధవారం బాధితులకు ఎస్ఐ ఆంజనేయులు ఫోన్‌లు అందజేశారు.

షాదిముబారక్, కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కును అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

నాగిరెడ్డిపేట్ మండలంలోని గోలీలింగా గ్రామంలో బుధవారం రోజు షాదీ ముబారక్ కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేసినట్లు ఎల్లారెడ్డి నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సురేందర్ గౌడ్ తెలిపారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే ఆదేశానుసారం ఇంటింటికి తిరిగి చెక్కులను పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ శివకుమార్, మోహన్ రెడ్డి, బాబు, నారాయణ, రవి, మన్నే రాములు, సిద్ధయ్య, క్రిస్టఫర్ మహేందర్, సలీం తదితరులు ఉన్నారు.

మండలంలోని పోచారం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు కిరణ్ కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాసరెడ్డి ఇంటింటికి వెళ్లి కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను బుధవారం పంపిణీ చేశారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు ఆదేశానుసారం ఇంటింటికి వెళ్లి చెక్కులను పంపిణీ చేసినట్టు పేర్కొన్నారు.

ఖో ఖో క్రీడల్లో అడ్లూర్ ఎల్లారెడ్డి బాలురు గెలుపొందారు

నవతెలంగాణ-సదాశివనగర్

మండల స్థాయిలో బుధవారం నిర్వహించిన ఖో ఖో క్రీడల్లో అడ్లూర్ ఎల్లారెడ్డి విద్యార్థులు గెలిపొందారు. అడ్లూర్ ఎల్లారెడ్డి విద్యార్థులు జిల్లా స్థాయి ఖో ఖో క్రీడల్లో పాల్గొంటారని ఉపాధ్యాయులు తెలిపారు. గెలుపొందిన విద్యార్థులు ఈనెల 16 నుంచి 21 వరకు జిల్లా స్థాయి క్రీడల్లో పాల్గొంటారని ఉపాధ్యాయులు తెలిపారు. విద్యార్థులను ఉపాధ్యాయులు అబినందించారు.

ఘనంగా వెంకట్ ఖజా దర్గా ఉత్సవాలు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండలంలోని ఆత్మకూర్ గ్రామంలో గల వెంకట్ ఖాజా దర్గా ఉత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మెదక్ జిల్లా వట్పల్లి వెంకట్ కాజా దర్గా పీఠాధిపతి ముకుందరావు చిస్తి ఆధ్వర్యంలో దర్గా ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆత్మకూరు గ్రామం నుంచి గంధం చాదర్ ఊరేగించి దర్గా వద్దకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి మనోహర్‌రెడ్డి, వెంకట్ ఖాజా భక్తులు, మహమ్మద్ తస్లీమ్ చిస్తి, గులాం మొహమ్మద్ ఖాజా చిస్తి, పెంటయ్య చిస్తి, అంజయ్య చిస్తి, ప్రభువు చిస్తి, వెంకటరామిరెడ్డి వసంత్ రెడ్డి, భూమ్ రెడ్డి, సుభాన్ రెడ్డి, సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులకు మద్దతు



సమ్మె నిర్వహిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

నవతెలంగాణ-కామారెడ్డి

జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం ముందు సమగ్ర శిక్ష ఉద్యోగులు నిర్వహించిన సమ్మె కార్యక్రమంలో ఎస్‌టియుటిఎస్ ప్రధాన కార్యదర్శి రామ్‌రెడ్డి సమ్మెకు బుధవారం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమగ్ర శిక్ష ఉద్యోగులకు తమ సంఘం ఎప్పుడు అండగా ఉంటుందని తెలిపారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్నటువంటి న్యాయమైన సమ్మె కార్యక్రమానికి రాష్ట్ర కమిటీ కూడా మద్దతు తెలపడం జరిగిందన్నారు. కేజీబీవీ ఉద్యోగులకు సమగ్ర శిక్షలో పనిచేయుచున్నటువంటి మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన సెలవులు మంజూరు చేయాలని ఆయన అన్నారు. అలాగే ఉద్యోగ భద్రత కల్పించే ముందు కనీస వేతనం అమలు చేయాలని ప్రభుత్వం సమగ్ర శిక్ష ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసుకొని రెగ్యులర్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్టియు ఫైనాన్షియల్ సెక్రెటరీ సయ్యద్ ఖలీముద్దీన్, ఎస్‌టియుటిఎస్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

హెచ్ఐవిపై అవగాహన



హెచ్ఐవిపైన అవగాహన కల్పిస్తున్న పలువురు

నవతెలంగాణ-తాడ్వాయి

అవగాహనతో హెచ్ఐవి రహిత సమాజాన్ని సాధించవచ్చని అధికారులు తెలిపారు. ప్రభుత్వ దృశ్య మాద్యమంతో బుధవారం మండల కేంద్రంలో హెచ్ఐవి లింక్ వర్కర్ హరిప్రియ గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు మేకల రాజు ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ప్రభుత్వం రాష్ట్రంలో హెచ్ఐవి లేకుండా మార్చాలని ఉద్దేశంతో ఇలాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేసిందని అన్నారు. లైంగిక పరిశుభ్రత పాటించాలని ఏవైనా సుఖ వ్యాధులు ఉంటే సత్వర చికిత్సలు చేయించు కోవాలని లైంగిక వ్యాధి ఉన్న పక్షంలో భాగస్వామి కూడా చికిత్స చేయించాలని దీనితో వ్యాధి సంక్రమణ నివారించబడుతుందని తెలిపారు. లింకు వర్కర్ల ద్వారా గ్రామస్థాయిలో హెచ్ఐవి నివారణ చర్యలు చేపడుతున్నట్లు వినిపించారు. ఈ కార్యక్రమంలో సేవా సంఘ కార్యకర్త సాయి గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల సర్వే ప్రారంభం

నవతెలంగాణ-తాడ్వాయి

ఇల్లు లేని పేదలకు ఇల్లు నిర్మించి ఇవ్వాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ గృహాల ఎంపిక బుధవారం ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ ఆధ్వర్యంలో సర్వే చేపట్టారు. ప్రజా పాలనలో ఇచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తూ పూరి గుడిసెల్లో నివసిస్తున్న కుటుంబాల వద్దకు వెళ్లి లబ్ధిదారుల సమాచారం నమోదు చేస్తున్నారు. ఈ సర్వే బీసీ కాలనీలో చేపట్టారు. ఎలాంటి అవకతవకలు లేకుండా నిక్కచ్చిగా ఎంపిక చేస్తామని అన్నారు. ఈ సర్వే దేమీకలాన్‌తో పాటు తదితర గ్రామాల్లో ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ రహీముద్దీన్ ఈఈ ప్రభాకర్ ఎంపీఓ సవితా రెడ్డి పంచాయతీ కార్యదర్శి బాలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దత్త జయంతి ఉత్సవాలు

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని లింగంపల్లి గ్రామంలో బుధవారం ఘనంగా దత్త జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాబాలు ప్రవచనాలు చదివి భక్తులకు వినిపించారు. శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భోజనాలు ఏర్పాటు చేశారు. భక్తుల కోసం దుకాణ సముదాయాలు ఏర్పాటు చేశారు.

సెల్‌ఫోన్ అప్పగింత

నవతెలంగాణ-లింగంపేట్



పోయిన సెల్‌ఫోన్‌ను ఎస్సై సుధాకర్ బాధితునికి బుధవారం అప్పగించారు. బానాపూర్ గ్రామానికి చెందిన బండి శ్రీనివాస తన మొబైల్ ఫోన్ పోయిందని గత వారం రోజుల క్రితం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుని ఫిర్యాదు మేరకు సిఈఐఆర్ పోర్టల్ ద్వారా మొబైల్ ట్రేస్ చేసి పోయిన సెల్‌ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బాధితునికి సమాచారం అందించి అతని సెల్‌ఫోన్‌ను అప్పగించినట్టు ఎస్సై తెలిపారు. సెల్‌ఫోన్ పోయిన వెంటనే బాతులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

కేంద్రీయ విద్యాలయం మంజూరుపట్ల హర్షం

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ మండల కేంద్రానికి కేంద్రీయ విద్యాలయం మంజూరు పట్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో బుధవార మిక్కడ అభినందన సభ నిర్వహించి ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ధరాస్ సాయిలు సీనియర్ నాయకులు విట్టల్ గురూజీ మాట్లాడుతూ వెనుకబడ్డ మద్నూర్ మండలం లో విద్యాభివృద్ధికి జుక్కల్ ఎమ్మెల్యే కృషి చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికే ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలకు శంకుస్థాపన పూర్తయిందని, ఏండ్లుగా ఎదురుచూస్తున్న కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్టు ఎమ్మెల్యే సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మద్నూర్ సింగిల్‌విండో చైర్మన్ శ్రీనివాస్ పటేల్, మండల మాజీ ఎంపీపీ ప్రజ్ఞకుమార్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు హనుమంతు యాదవ్, కొండ గంగాధర్, వట్నాల రమేష్, అమూల్ బండి గోపి, మాజీ ఎంపిటిసి నాగేష్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వ్యాపారస్తుల ఆధ్వర్యంలో..

కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు ప్రత్యేక కృషిచేసి మంజూరు చేయించడంలో ఎమ్మెల్యే కృషికి మద్నూర్ మండల కేంద్ర వ్యాపారస్తులు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుతూ గాంధీ చౌక్ ఆవరణంలో ఎమ్మెల్యే తోటా లక్ష్మి కాంతారావు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో అన్ని రకాల వ్యాపార సముదాయాల యజమానులు పాల్గొన్నారు.

ఏకలవ్య గురుకులంలో

ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

- 14 తేది చివరి గడువు

నవతెలంగాణ-గాంధారి

మండల కేంద్రంలోని ఏకలవ్య గురుకులంలో పని చేయుటకు ఔట్ సోర్సింగ్ పద్ధతిన కాటరింగ్ అసిస్టెంట్ (01), మెస్ హెల్పర్ (05), శానిటేషన్ (02), ఎలక్ట్రీషియన్ కమ్ ప్లంబర్ (01), చౌకిదార్ (01), గార్డెనర్ (01), స్టాఫ్ నర్స్ (01) పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఒక ప్రకటనలో తెలిపారు. కేటరింగ్ విభాగంలో డిగ్రీ పూర్తి చేసిన వారు అర్హులన్నారు. మెస్ హెల్పర్, శానిటేషన్ కోసం 10వ తరగతి, ఎలక్ట్రీషియన్ కమ్ ప్లంబర్ పోస్టుకు 10వ తరగతితోపాటు ఐటిఐ లేదా పాలిటెక్నిక్, స్టాఫ్ నర్స్ కొరకు బీఎస్సీ నర్సింగ్/జీయన్‌ఎం రెండున్నర సంవత్సరాలు అనుభవం వుండాలని సూచించారు. అలాగే కనీసం 50 పడకల ఆసుపత్రిలో ఒక సంవత్సరంపాటు పని చేసిన అనుభవం వుండాలని, దరఖాస్తులను ఈ నెల 14 లోపు గాంధారిలో ఏకలవ్య గురుకులంలో సమర్పించాలని తెలిపారు. నూతనంగా ఏర్పడిన కామారెడ్డి జిల్లాలో పదవ తరగతి పూర్తి చేసిన బోనాఫైడ్ గల అభ్యర్థులు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. పూర్తి మెరిట్ ఆధారంగా నియామకాలు చేస్తామని తెలిపారు. ఇవి పూర్తి తాత్కాలిక పోస్టులని, రెగ్యులర్ ఉద్యోగుల నియామకం కొరకు ఇది వరకే నోటిఫికేషన్ విడుదలైందన వీరి తొలగింపు క్షణంలోనైనా జరగవచ్చని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు గాంధారి ప్రిన్సిపాల్ నెంబర్ 8005545951కు సంప్రదించాలని సూచించారు.

క్రీడలతో శారీరక ఉత్తేజం

- మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మరెడ్డి కృష్ణారెడ్డి

నవతెలంగాణ-పిట్లం

క్రీడలు శారీరక ఉత్తేజాన్ని కలిగిస్తాయని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మా రెడ్డి కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో సీఎం కప్ మండల స్థాయి క్రీడా పోటీలను అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతోపాటు క్రీడా పోటీలలో రాణించాలని సూచించారు. క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో ఎదగాలని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీవో కమలాకర్, ఎంఈఓ దేవి సింగ్, నోడల్ అధికారి వికారి రమణారావు, ఆర్ఐ శీతల్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పిఈటి తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటునక్న వైస్ చైర్మన్

ఘనంగా భాషా దినోత్సవం వేడుకలు

నవ తెలంగాణ-తాడ్వాయి

కృష్ణాజివాడి జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రభుత్వ ఆదేశాల మేరకు భారతీయ భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించినట్టు ప్రధానోపాధ్యాయురాలు నివేదిత బుధవారం తెలిపారు. ఉపాధ్యాయురాలు సుజాత ఆధ్వర్యంలో సాంస్కృతి ఆయా రాష్ట్రాల నృత్య కళలను విద్యార్థులచే ప్రదర్శింపజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గిర్మ బోయ గంగాధర్, శ్రీహరి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎలాంటి షరతులు లేకుండా జీవన భృతి ఇవ్వాలి

- బీడీ కార్మికుల ర్యాలీ

నవతెలంగాణ-కామారెడ్డి

బీడీ కార్మికులకు 2014 కటాఫ్ తేదీని తొలగించి, ఎలాంటి షరతులు లేకుండా రూ.4016 జీవన భృతి ఇవ్వాలని జిల్లా కేంద్రంలో బీఎల్ఎఫ్ బీడీ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బీడీ కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించారు. బుధవారం సంయుక్త కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, పిడి, డిఆర్డిఓ పిడ, సురేంద్రర్‌లకు వినతి పత్రాన్ని అందజేశారు. జిల్లా కేంద్రంలో సిఎస్ఐ చార్చి నుంచి తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం బిఎల్‌టీయూ, శ్రామిక శక్తి తెలంగాణ బీడీ వర్కర్స్ యూనియన్, ఎ.ఐ.ఎఫ్ టీయూల ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం వరకు బీడీ కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించారు. అందరికీ రూ 4016 జీవన భృతి ఇప్పించడానికి కృషి చేస్తామని అధికారులు సానుకూలంగా స్పంచారని తెలిపారు. కార్యక్రమంలో బహుజన లెఫ్ట్ ట్రేడ్ యూనియన్, బిఎల్ టీయూ, రాష్ట్ర అధ్యక్షులు, దండి వెంకట్, తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు, యస్, సిద్ధిరాములు, రాష్ట్ర ఉపాధ్యక్షులు, నాగారపు యెల్లయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, యం, ఆంజనేయులు, శ్రామిక శక్తి తెలంగాణ బీడీ వర్కర్స్ యూనియన్, ఎఐఎఫ్ టీయూ, రాష్ట్ర అధ్యక్షురాలు, యస్ అనూసుయ, రాష్ట్ర నాయకులు కుర్తి లింగం, వెంకట లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న బీడీ కార్మికులు

కొత్త రేషన్ కార్డులకోసం వినతి


ధర్నా చేస్తున్న దరఖాస్తు దారులు

నవతెలంగాణ-పోతంగల్
మండలం లోని దరఖాస్తు దారులు కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలని ధర్నా చేశారు. బుధవారం తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభు త్వం ఇచ్చిన హామీ మేరకు, కొత్త రేషన్ కార్డులను త్వరగా మంజూరు చేయాలన్నారు. అలాగే మార్పులు చేర్పులకు కూడా అవకాశం ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో బజరంగ్, కిరణ్ సెట్, సూదం అశోక్, తుకారం, శంకర్, సయ్యద్, హన్మాండ్లు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- ఎస్సై వంశీకృష్ణారెడ్డి

నవతెలంగాణ-ఎడపల్లి
ప్రస్తుత రోజుల్లో సైబర్ నేరగాళ్ల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని ఎడపల్లి ఎస్సై వంశీకృష్ణారెడ్డి కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు ఎడపల్లి మండలం తానకలాన్ గ్రామ నివాసి ఓ వ్యక్తి పోలీస్ స్టేషన్‌కి వచ్చి తన క్రెడిట్ కార్డ్ డీఆక్టివేట్ అవడంతో గూగుల్ లో వెతికి బ్యాంక్ యొక్క అఫిషియల్ మెయిల్ అనుకొని క్రెడిట్ కార్డు యాక్టివేషన్ కోసం మెసేజ్ చేయగా వాళ్ళు పంపించిన ఒక లింక్ ద్వారా తన అకౌంట్ నుండి దాదాపు 28వేల రూపాయలు పోయాయని పోలీస్ స్టేషన్లో దరఖాస్తు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ప్రజలెవరూ ఆన్లైన్ ద్వారా ఎవరైనా తెలియని వ్యక్తుల క్రెడిట్ లేదా డెబిట్ కార్డు వివరాల కోసం అడిగిన లేదా ఓటీపీలు అడిగితే చెప్పొద్దని అన్నారు. సైబర్ నేరగాళ్ల పట్ల జాగ్రత్త వహించాలని ఆయన గ్రామ యువకులను, పెద్దలను కోరారు.

నేడు మండల సమావేశం

నవతెలంగాణ-ముప్కాల్
గ్రామపంచాయతీ సాధారణ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని 7 గ్రామాల (ప్రజాప్రతినిధులు) గ్రామ, మండల రాజకీయ పార్టీల అధ్యక్షులతో గురువారం ఉదయం 11గంటలకు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో రాష్ట్ర ఎన్నికల కమీషనర్ నోటిఫికేషన్ ప్రకారం అనుసరించి సమావేశం ఏర్పాటు చేస్తున్నట్టు మండల అభివృద్ధి అధికారి నరేష్ ఆనంద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాల్లో (74) పంచాయతీ వార్డుల వారిగా ప్రచురించిన పోలింగ్ స్టేషన్ల డ్రాఫ్ట్‌పై మండల సమావేశం ఏర్పాటు చేయడం జరుగుతుందని సూచించారు. కావున వివిధ రాజకీయ పార్టీల అధ్యక్షులు (ప్రజాప్రతినిధులు) సమావేశంకు హాజరుకావాలని పేర్కొన్నారు.

కుల సంఘాల అదనపు గదుల నిర్మాణానికి భూమిపూజ


మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-ఏర్గట్ల
మండల కేంద్రంలోని బర్మ పెద్ద సంఘం, శ్రీ కృష్ణ యాదవ సంఘాల అదనపు గది నిర్మాణాలకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సోమ దేవరెడ్డి కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా డీసీసీ ఉపాధ్యక్షులు శివన్నోళ్ల శివకుమార్ మాట్లాడుతూ.. బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్‌రెడ్డి చొరవతో స్పెషల్ డెవలప్ మెంట్ ఫండ్(ఎస్డీఎఫ్) ద్వార బర్మ వారి పెద్ద సంఘం అదనపు గది నిర్మాణానికి రూ.4లక్షలు, శ్రీ కృష్ణ యాదవ సంఘానికి రూ.2 లక్షలు నిధులు మంజూరు కాగా బుధవారం పనులను ప్రారంభించామని తెలిపారు. ఏర్గట్ల గ్రామానికి సంబంధించి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రూ.60లక్షల వరకు అభివృద్ధి పనులను తేవడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఇరు సంఘాల సభ్యులు సునీల్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రేండ్ల రాజారెడ్డి, ముస్కు మోహన్ రెడ్డి, గడ్డం జీవన్, పన్నాల నర్సారెడ్డి, బద్దం లింగారెడ్డి, మేరుగు గంగయ్య, సురేష్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి సైన్స్‌ఫెయిర్‌లో రెంజర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయ సిబ్బంది

నవతెలంగాణ-ముప్కాల్
జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ పోటీలలో రెంజర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొని మొదటి స్థానంలో నిలిచారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు జక్కుల రవి కుమార్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో విద్యార్థులను అధ్యాపక బృందం అభినందించారు. జిల్లా స్థాయిలో అంకిత, వైశాంతిలు మంచి ప్రతిభ చూపి జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచి, పాఠశాలకు పేరుప్రఖ్యాతులు తెచ్చారన్నారు. అదేవిధంగా విద్యార్థులకు బోధించిన సైన్స్ ఉపాధ్యాయులు శ్రీనివాస్, మల్లేష్, సామ ప్రసాద్, మురళిలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రెంజర్ల పాఠశాల ఉపాధ్యాయులు రవి, దేవసహాయం, మోహన్, మదర్, గంగాధర్, గోపి, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ మోటార్ బిల్లులు చెల్లించాలి

- విద్యుత్ శాఖ అధికారులు రైతులకు విజ్ఞప్తి

నవతెలంగాణ-ఎడపల్లి
మండలంలోని వ్యవసాయ మోటారు బిల్లులు ఈ నెల 15లోపు సబ్ స్టేషన్ నందు చెల్లించాలని విద్యుత్‌శాఖ అధికారులు రైతన్నలకు విజ్ఞప్తి చేశారు. లేనియెడల విద్యుత్తు నిలిపివేయబడుతుందని విద్యుత్‌శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ మోటార్ల బిల్లులు చెల్లించి తెలంగాణ నార్తన్ పవర్ విద్యుత్ సంస్థకు సహకరించాలని విద్యుత్ శాఖ అధికారులు రైతన్నలను కోరారు.

పెద్దమ్మతల్లి ఆలయానికి విరాళం అందజేత

నవతెలంగాణ-ఎడపల్లి
మండలంలోని కుర్నపల్లి గ్రామంలో నూతనంగా నిర్మాణం చేపట్టిన శ్రీ పెద్దమ్మ తల్లి ఆలయానికి భాజపా సీనియర్ నాయకులు కందగట్ల రాంచందర్ (అన్నాసేట్) రూ.20,001 విరాళం బుధవారం అందజేశారు. కార్యక్రమంలో భాజపా జిల్లా కార్యవర్గ సభ్యులు మల్లెపూల శ్రీనివాస్, ముదిరాజ్ సంఘం సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, తదితరులు ఉన్నారు.

జిల్లా బేస్ బాల్ జట్టును ప్రథమ స్థానంలో నిలపాలి


ఎంపికైన బేస్ బాల్ జట్టు క్రీడాకారులు

నవతెలంగాణ-ఆర్మూర్
జిల్లా బేస్ బాల్ జట్టును ప్రథమ స్థానంలో నిలపాలని జిల్లా బేస్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు ఎల్. మధుసూదన్ రెడ్డి అన్నారు. పట్టణంలోని జడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాల క్రీడామైదానంలో జిల్లా సీనియర్ పురుషుల బేస్ బాల్ జట్టు ఎంపికను జిల్లా బేస్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు ప్రారంభించినట్లు జిల్లా బేస్ బాల్ ప్రధాన కార్యదర్శి సొప్పరి వినోద్ తెలిపారు. బేస్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు మధుసూదన్ మాట్లాడుతూ... రాష్ట్ర పోటీలలో జిల్లా జట్టును ప్రథమ స్థానంలో నిలవాలని, ఎంపికైన క్రీడాకారులలు ఈనెల 13 నుండి 15 వరకు మహబూబాబాద్ ఎన్టీఆర్ స్టేడియంలో జరిగే రాష్ట్ర బేస్ బాల్ పురుషుల ఛాంపియన్ షిప్ పోటీలకు పంపనున్నట్లు తెలిపారు. ఎంపిక కార్యక్రమంలో జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగామోహన్, వ్యాయామ ఉపాధ్యాయులు కొటలా సంజీవ్, కోచ్ నరేష్ పాల్గొన్నారు.

చందూర్‌కు 30 పడకల ఆసుపత్రి

- పోచారం శ్రీనివాస్ రెడ్డి కృషితో 1 కోటి 45 లక్షల నిధుల మంజూరు:
- కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-వర్ని(చందూర్)
చందూర్‌కు 30 పడకల ఆస్పత్రి మంజూరైనట్టు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. బాన్సువాడ ఎమ్మెల్యే, రాష్ట్ర వ్యవసాయ శాఖ సలహాదా రులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి కృషితో 1.45 కోట్ల రూపాయల నిధులతో ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. మండలాల పునర్విభజనలో ఇక్కడి నాయకుల కోరిక మేరకు పోచారం.. కొత్తగా ఐదు గ్రామాలతో చందూర్ మండలంగా మార్చారని తెలిపారు.

హామీమేరకు అభివృద్ధి..
చందూర్ మండలం చిన్న మండలం అయినా ఇక్కడ ఏ కొరత లేదు. అందుకు స్థానిక ప్రజా ప్రతినిధులు ఒక వైపు అయితే మరో వైపు పోచారం శ్రీనివాస్‌రెడ్డి అని నాయకులు పేర్కొంటున్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన మండల వాసులకు ఇచ్చిన హామీని పోచారం మరువలేదని ప్రజా ప్రతినిధుల మాట. మండలానికి 1 కోటి 45 లక్షల నిధులతో 30 పడకల ఆసుపత్రిని మంజూరు చేయటం, ముందుగా ప్రజల ఆరోగ్యంను దృష్టిలో పెట్టుకొని అంబులెన్సును ఇచ్చినట్టు తెలిపారు. దీంతో మరి కొన్ని రోజుల్లో చందూర్ అభివృద్ధిలో మరింత ముందుకు పోతుంది. ఇందుకు పోచారం శ్రీనివాస్‌రెడ్డి కృషి ఎంతో ఉందని అంటున్నారు.



అడిగింది కాదనకుండా ఇచ్చిన పోచారం..
పోచారం శ్రీనివాస్‌రెడ్డి తాము అడిగిన ప్రతీది కాదు.. లేదు అనకుండా మండలం అభివృద్ధికి అన్ని కార్యాలయాలు, కెనాల్, సమీకృత కార్యాలయం, లిఫ్ట్ ఇరిగేషన్‌తో ఇలా కోట్ల రూపాయలు నిధులు ఇచ్చి మండలం అంటే అనేలా చేశారు. ప్రస్తుతం కోటి 45లక్షల నిధులతో 30 పడకల ఆసుపత్రి అంబులెన్సు అడుగగానే ఇచ్చారని మాజీ ప్రజాప్రతినిధుల అనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు కావాల్సినవి మంచి వైద్యం, విద్య, గూడు కల్పించారు. అందుకు తాము ఎప్పుడు పోచారం శ్రీనివాస్‌రెడ్డికి రుణపడి ఉంటామని తెలిపారు.

మధ్యాహ్న భోజన పథకాన్ని నిర్వీర్యం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

- మధ్యాహ్న భోజన కార్మిక సంఘం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తోపునూరు చక్రపాణి
- సెంట్రల్ కిచెన్ విధానం రద్దుచేయాలి

నవతెలంగాణ-ఆర్మూర్
మధ్యాహ్న భోజన పథకాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తోపునూరు చక్రపాణి అన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి, తహసీల్దార్ గజానన్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం పాలన 11 సంవత్సరాలు గడుస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ఎలాంటి సహాయ సహకారాలు అందించలేదన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా మధ్యాహ్న భోజన పథకాన్ని నిర్వీర్యం చేసిందన్నారు. బీజెపి ప్రభుత్వం గత రెండు సంవత్సరాల నుంచి 2021 నుంచి ఇప్పటివరకు స్లాబు రేటు పెంచలేదని, యూపీఏ-2 కాంగ్రెస్ ప్రభుత్వంలో 7.5శాతం ఉన్న స్లాబురేటిని బిజెపి ప్రభుత్వం 2014 వచ్చిన తర్వాత ఆరు శాతానికి కుదించిందని తెలిపారు.



మాట్లాడుతున్న నాయకులు

పెంచాల్సింది పోయి కుదించడం ఎంతవరకు సమంజసమో ప్రభుత్వం ఆలోచించుకోవాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా కేంద్ర ప్రభుత్వం మీద ఆధారపడి ఈ తెలంగాణలో ఉన్న మధ్యాహ్న భోజన పథకాన్ని గత ప్రభుత్వాలు పాలకులు నిర్వీర్యం చేశాయన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్లాబ్ రేటు విద్యార్థికి 25 రూపాయలు ఇవ్వాలని, లేదా నిత్యవసరవస్తువులు గ్యాస్ సిలిండర్ కోడిగుడ్డున సరఫరా చేయాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చిన రూ.10000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. సెంట్రల్ కిచెన్ రద్దుచేసి నాణ్యమైన భోజనం అందించడానికి ఏమైనా ప్రకారం అందించడానికి ప్రభుత్వాలు కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో గంగాధర్, విజయలక్ష్మి, గంగాధర్, ప్రమీల, కార్మికులు, పాల్గొన్నారు.

ఎంపిడిఓకు ఘనంగా వీడ్కోలు


ఎంపీడీవోను సన్మానించిన పలువురు

నవతెలంగాణ-డిచ్‌పల్లి
మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా రవీందర్ ఆరు నెలల సెలవుపై వెళ్తున్నందున వారికి మండల ప్రత్యేక అధికారి యోహాన్, ఎంపీఓ శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో వీడ్కోలు సన్మాన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొని ఎంపీడీవో రవిందర్ హయాంలో కలిసి పని చేసిన కాలం, పాత జ్ఞాపకాలను, తమ అనుభవాలను అందరితో పంచుకున్నారు. కార్యక్రమంలో గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది, ఎంఈఓ శ్రీనివాస రెడ్డి, ఎపిఓ మంజుల, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, కార్యదర్శులు నిట్టు కిషన్ రావు, కవిత, బాలకృష్ణ, నరేష్, జయశ్రీ, దివ్య వెముల, నరేష్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

యూనివర్సిటీలో ఇంటర్ కాలేజ్ అథ్లెటిక్స్ పోటీలు


పోటీలలో పాల్గొన్న క్రీడాకారులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి
తెలంగాణ యూనివర్సిటీ ఇంటర్ కాలేజ్ అథ్లెటిక్స్ మెన్, ఉమెన్ ఛాంపియన్‌షిప్ 2024 పోటీలు యూనివర్సిటీ ప్లే గ్రౌండ్‌లో ప్రారంభించామని తెలంగాణ యూనివర్సిటీ డైరెక్టర్ స్పోర్ట్స్ డాక్టర్.జి.బాలకిషన్ బుధవారం తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో ఉమ్మడి జిల్లా నుంచి 12 కళాశాలల నుంచి సుమారు 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ టోర్నమెంట్‌లో ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ నిబంధనల ప్రకారం సెలెక్షన్స్ చేస్తామని, ఎంపికైన క్రీడాకారులు ఒడిశాలోని కిస్ యూనివర్సిటిలో ఈ నెల 26, 30 తేదీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ టోర్నమెంట్ నిర్వహించడానికి పర్మిషన్ ఇచ్చిన గౌ.వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి.యాదగిరి రావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.యాదగిరిలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సెలక్షన్స్‌లో టోర్నమెంట్ ఆర్గనైసింగ్ సెక్రటరీ డాక్టర్ బిఆర్ నేత, ఫిజికల్ డైరెక్టర్స్ డాక్టర్. బాలమణి, రమ, రూప, అంజలి, అనిల్‌కుమార్ క్రీడాకారులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పేదలకు పంపణీ చేయాలి

- సీపీఐ(ఎం) డిమాండ్

నవతెలంగాణ-వర్ని(రుద్రూర్)
మండల కేంద్రంలోని జవహర్ నగర్, రాజీవ్ నగర్ కాలనీలో గల డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను అర్హులైన నిరుపేదలకు వెంటనే పంపిణీ చేయాలని సీపీఎం పార్టీ డిమాండ్ చేసింది. బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, డిప్యూటీ తహసీల్దార్ సురేందర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం ఏరియా కార్యదర్శి నన్నేసాబ్ మాట్లాడుతూ.. రుద్రూర్ మండల కేంద్రంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించి, నిరుపేదలకు పంపిణీ చేయకుండా చేసిందన్నారు. బాన్సువాడ సీనియర్ శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు పోచారం శ్రీనివాస్ రెడ్డి డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీపై దృష్టి సారించకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ఎమ్మెల్యే డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సమస్యపై నోరు విప్పాలని ఆయన డిమాండ్ చేశారు. నేటికీ అధికారులు లబ్దిదారుల జాబితా తయారు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. గతంలో అధికారులు నిర్లక్ష్యం చేయడంతో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల తాళాలు పగలగొట్టి, ఇండ్లను స్వాధీన పరుచుకున్న సంఘటన గుర్తు చేశారు. అధికారులలో మళ్లీ అదే నిర్లక్ష్య ధోరణి కనబడుతుందని నిప్పులు చెరిగారు. స్థానిక ఎన్నికలలోపు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను అర్హులైన నిరుపేదలకు పంపిణీ చేయకపోతే పేద ప్రజలే స్వాధీన పరుచుకునే పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో నెల్లూరి లక్ష్మణ్, నాయకులు భీమయ్య, గంగాధర్, అప్సర్ ఖాన్, సాయిలు, హన్మవ్వ తదితరులు పాల్గొన్నారు.


వినతి పత్రాన్ని అందజేస్తున్న నాయకులు

దోపిడీ దొంగల హల్‌చల్

- ముప్కాల్ మండల కేంద్రంలోని ఓ ఇంట్లోకి చొరబడి నగదు, బంగారం చోరీ
- ఆర్మూర్ పట్టణంలోని మెడికల్‌లో దోపిడీ

నవతెలంగాణ-ముప్కాల్/ఆర్మూర్
మండల కేంద్రానికి చెందిన కట్ట మానస ఇంట్లో మంగళవారం రోజు అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో గుర్తుతెలియని దుండగులు దొంగతనానికి పాల్పడ్డారని పోలీసులు వెల్లడించారు. కట్ట మానస చెల్లెలు వివాహం నిమిత్తం దాచిన సొమ్ము లక్షా పది వేల రూపాయలు, రెండుగ్రాముల ఉంగరం, గ్రాము ఉంగరాలు మూడు తన ఇంట్లో భద్రపరిచింది. రాత్రి పూట 10 గంటలకు మండల కేంద్రంలోనే ఉండే చెల్లెలు ఇంటికి వెళ్లి అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో ఇంటికి వచ్చింది. అలికిడి విని దొంగలు అని కేకలు వేశారు. దీంతో దొంగలు పారిపోయారు. ఇంట్లో ఉన్న నగదు, బంగారంను ఎత్తుకెళ్లినట్లు పోలీసులకు పిర్యాదు చేశారు. దొంగతనం జరిగిన ఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. వెంటనే క్లూస్ టీంకు సమాచారం అందించగా క్లూస్ టీం అధికారులు ఇంటి కుటుంబ సభ్యుల వేలిముద్రలతో పాటు ఇతర వివరాలను సైతం సేకరించారు. దొంగతనానికి పాల్పడిన నిందితులను త్వరలోనే పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.



పట్టణంలో దొంగల బీభత్సం
ఆర్మూర్ : పట్టణంలో దొంగలు బీభత్సం సృష్టించారు. బస్టాండ్ సమీపంలోగల మహాలక్ష్మి కాలనీలో దొండి మెడికల్‌లో దొంగలు హల్చల్ చేశారు. బుధవారం ఉదయం నాలుగు గంటల సమయంలోనే టాటా ఏసి వాహనంలో ఐదుగురు వచ్చినట్లు సీసీ కెమెరాలో రికార్డ్ అయింది. సుమారు 3నుండి 4లక్షల వరకు డబ్బులు ఎత్తుకెళ్ళినట్లు బాధితులు తెలిపారు. దొంగతనం జరిగిన మెడికల్ నుండి సీసీ కెమెరా డివిఆర్‌ను దుండగులు ఎత్తుకెళ్లారు. ఘటన స్థలానికి ఎస్సై గోవింద్ ఆధ్వర్యంలో చేరుకొని పరిశీలించారు. పట్టణంలోని మూడు దుకాణాల్లో బుధవారం తెల్లవారుజామున చోరీ జరిగిందని స్టేషన్‌హౌస్ ఆఫీసర్ సత్యనారాయణ తెలిపారు. మెడికల్ షాపు నుండి సుమారు 3 లక్షలు, మరోక మెడికల్ నుండి సుమారు 30 వేలు, ఓసిటీ స్కానింగ్ సెంటర్ నుండి టీవీలు ఎత్తుకెళ్లినట్లు వెల్లడించారు. ఉదయం మూడుగంటల నుండి నాలుగు గంటల ప్రాంతంలో చోరీ జరిగినట్లుగా గుర్తించామన్నారు. రెండు బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వివాహం కావడంలేదని యువకుడు ఆత్మహత్య

నవతెలంగాణ-మెండోరా
నిజామాబాద్‌కు చెందిన ఉల్లెందుల రాజు మృతదేహం పోచంపాడ్ గోదావరి నదిలో లభ్యమైనట్లు ఎస్ఐ నారాయణ బుధవారం తెలిపారు. ఉల్లెందుల రాజు (35) పెట్రోల్ బంక్‌లో పనిచేస్తున్నాడు. మృతుడి గురించి విచారించగా మృతుడికి చాలా కాలంగా వివాహం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ పేర్కొన్నారు.

శిథిలావస్థలో మహాత్ముని విగ్రహం



నవతెలంగాణ-బాల్కొండ

దేశానికి స్వాతంత్రం తెచ్చిన మహాత్మా గాంధీ విగ్రహం శిథిలావస్థలో దీనంగా ఉంది. భావి పౌరులు ఆదర్శంగా తీసుకోవాలని పూర్వం మండల కేంద్రంలో గల పోచమ్మ గల్లి ప్రధాన కూడలి వద్ద గాంధీజీ విగ్రహం ఏర్పాటుకు అప్పటి నాయకులు విగ్రహం ఏర్పాటు చేశారు. కాలగమనంలో శిథిలావస్థకు చేరి రెండు హస్తాలు కోల్పోయి దిక్కులేని విగ్రహంగా నిలిచింది. ప్రజా పరిపాలన ప్రజా విజయోత్సవాలు సందర్భంగా ఈ అంశం చర్చ నీయాంశంగా మారింది. దీనిపై ప్రభుత్వ యంత్రాంగం స్పందించి మహాత్మా గాంధీ విగ్రహాన్ని వెంటనే పునరుద్ధరణ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-మాక్లూర్

పేద, మధ్య తరగతి వర్గాలైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఇబీసీ ప్రజలకు విద్యా, వైద్యం, ఉపాధి, భూమి, ఇల్లు సాధనకు ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర నాయకులు ప్రేమ్ మహారాజ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ముందు బుధవారం రిలే నిరాహార దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలందరికీ నాణ్యమైన ఉచిత విద్యను, ఉచిత వైద్యాన్ని, అర్హతలను బట్టి ఉపాధి, అర్హులైన వారందరికీ సాగునీటి సౌకర్యంతో ఒక ఎకరం వ్యవసాయ భూమిని ఇవ్వాలని అన్నారు. అర్హులైన వారందరికీ 200 గజాల స్థలంలో నాలుగుగదుల ఇల్లును నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అధ్యక్షులు కిషన్, జిల్లా నాయకులు రమేష్, మండల నాయకులు గంగాధర్, సుమన్, అనిల్, పద్మ రావ్, పోశెట్టి, సురేష్, శంకర్, కె.గంగాధర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక, శారీరక దృఢత్వం

- సీఎం కప్ క్రీడలను ప్రారంభించిన ఎంపీడీవో
- విజేతలకు బహుమతుల పంపిణీ

నవతెలంగాణ-రెంజల్

విద్యార్థులు విద్యుత్‌తోపాటు క్రీడల్లో పాల్గొనాలని, క్రీడల వల్ల విద్యార్థుల్లో మానసిక శారీరక దృఢత్వం పెరుగుతుందని ఎంపీడీవో వెంకటేష్ జాదవ్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో సీఎం క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో యువత మొబైల్ ఫోన్లకే పరిమితం అవుతున్నారని, వాటిని వదిలి క్రీడల పట్ల ఆసక్తిని కనబరిచినట్లయితే విద్యార్థుల్లో మానసిక, శారీరక దృఢత్వం పెరుగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి కట్ట ఆంజనేయులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మొబిన్ ఖాన్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, తాజా మాజీ సర్పంచ్ రమేష్ కుమార్, కాంగ్రెస్ నాయకులు జి.సాయి రెడ్డి, సాయిబాబా గౌడ్, ఏఎంసి డైరెక్టర్ కె. శ్రీనివాస్, గ్రామ కమిటీ అధ్యక్షులు సగ్గువ వెంకటి, మహిళా అధ్యక్షురాలు ఇందిరా దేవి, ఎంపీవో రఫీ హైమద్, పిఆర్‌టిఓ మండల ప్రధాన కార్యదర్శి కిషోర్ కుమార్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

మోర్తాడ్ :మండల కేంద్రంలో జరిగిన సీఎం కప్ పోటీల్లో విజేతలకు బహుమతులు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో తిరుమల తెలిపారు. సీఎం కప్ పోటీల్లో మండలంలోని పలు పాఠశాల విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభ కనబరిచారని చెప్పారు. వాలీబాల్, ఖోఖో పోటీల్లో మహాత్మ జ్యోతిరావు పూలే పాఠశాలకు మొదటి బహుమతి, మహిళా విభాగంలో కబడ్డీ, ఖోఖోలో మోర్తాడ్ బాలికల పాఠశాలకు మొదటి బహుమతి, శెట్పల్లి పాఠశాలకు బాలుర, బాలికల పోటీల్లో ద్వితీయ బహుమతి సాధించినట్లు తెలిపారు. గెలుపొందిన విద్యార్థులకు స్థానిక గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు అశోక్ అధికారులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ సమీరెడ్డి కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి గోపి, అశోక్, కార్యదర్శి సైఫుద్దీన్ పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి:మండలకేంద్రంలోని మోడల్ స్కూల్ నిర్వహిస్తున్న సీఎం కప్ క్రీడలను జిల్లా అడిషనల్ కలెక్టర్ అంకిత్ కుమార్ బుధవారం పరిశీలించారు. క్రీడల్లో పాల్గొంటున్న విద్యార్థులు పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ అంకిత్ కుమార్ మాట్లాడుతూ క్రీడాకారులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో సతీష్ కుమార్, ఎంఈఓ శ్రీనివాస్, ఎంపిఓ యూసుఫ్ ఖాన్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఎడపల్లి : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో ఎడపల్లి పాఠశాలలో సీఎం కప్ క్రీడ పోటీలను ప్రారంభించారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, తదితర ఆటలను నిర్వహించారు. ఈ పోటీలను మండల పరిషత్ అభివృద్ధి అధికారి శంకర్, మండల విద్యాశాఖ అధికారి సాయిలు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పోటీల్లో ఎడపల్లి గ్రామం, ఏఆర్‌పి క్యాంప్ గ్రామ యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు ఈ కార్యక్రమానికి మండల పంచాయతీ అధికారి మన్మోహన్ శాస్త్రి, ఎడపల్లి ఏఎస్ఐ ఇలియాస్, పోలీస్ శాఖ, ఆరోగ్యశాఖ సిబ్బంది హాజరయ్యారు. అతిథులు మాట్లాడుతూ.. క్రీడలు శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కలుగజేస్తాయని, అందరూ రోజు కొంత సమయం కేటాయించి తనకు నచ్చిన ఏదైనా ఒక క్రీడను ఆడాలని తెలిపారు. క్రీడా పోటీల్లో గెలుపొందిన విజేతలకు అధికారులు మెడల్స్, షీల్డ్స్, బహుమతులను ప్రధానం చేశారు. కార్యక్రమంలో ఏఆర్‌పీ క్యాంప్ ప్రధానోపాధ్యాయులు రమేష్, మమత, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి : గ్రామీణ ప్రాంత యువకుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యానికి బయటికి తీసి వారికి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో చోటు దక్కించుకోవడానికి క్రీడాకారులను పోత్స హించడానికి సీఎం కప్ పోటీలు దోహదపడతాయని మండల పరిషత్ అభివృద్ధి అధికారి లక్ష్మారెడ్డి అన్నారు. ఇందల్ వాయి మండలంలోని ఇందల్ వాయిలో, డిచ్ పల్లి మండలం లోని ఖిల్లా డిచ్ పల్లి లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో రెండు రోజులపాటు క్రీడా పోటీలను నిర్వహించారు. బుధవారం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి లక్ష్మారెడ్డి హాజరై గెలుపొందిన వారికి బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా ఉపాధ్యాయులు లక్ష్మీనాథం, గౌరవ అతిథిగా డిసిసిబి డైరెక్టర్ కోరేపల్లి కోరట్ పల్లి ఆనంద్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోత్కురి నవీన్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి చుక్కబొట్ల భరత్, శ్రీధర్, పాశం అశోక్, నాగేష్, వెంకటేశ్వర్లు, వ్యాయామ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



ఎడపల్లి : విజేతలుగా నిలిచిన విద్యార్థులు



జక్రాన్‌పల్లిలో..



రెంజల్ : మాట్లాడుతున్న ఎంపీడీవో



మోర్తాడ్‌లో..



డిచ్‌పల్లిలో..

మహిళ అదృశ్యం



నవతెలంగాణ-ముప్కాల్

మండల కేంద్రానికి చెందిన పుట్ట లక్ష్మి (52) అక్టోబర్ 29న ఇంట్లో నుండి కూలీ పనికి వెళ్తున్నాని చెప్పి తిరిగి రాలేదు. దీంతో లక్ష్మీ భర్త అయిన పుట్ట పోశెట్టి మంగళవారం పోలీస్ స్టేషన్ కు వచ్చి పిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వి.రజినీకాంత్ తెలిపారు. ఇంట్లో నుంచి వెళ్లిన నాటి నుంచి బంధువుల ఇండ్లలో వెతికిన ఆచూకీ లభించకపోవడంతో స్థానిక పోలీస్ స్టేషన్లో బాధితురాలి భర్త పోశెట్టి ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. ఎవరికైనా ఆమె ఆచూకీ లభిస్తే ముప్కాల్ పోలీసు స్టేషన్‌కు సమాచారం అందించాలని ఎస్ఐ కోరారు..

సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

- మోకాళ్ళపై నిలబడి నిరసన

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చౌరస్తాలోగల ధర్నా చౌక్‌లో ఐదోరోజు సమ్మె బుధవారం నిర్వహించారు. సమగ్ర శిక్ష ఉద్యోగులను ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వ మొండి వైఖరికి నిరసనగా మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష ఉద్యోగులు మాట్లాడుతూ.. తమ సమస్యలు ప్రభుత్వం దృష్టికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్ళేందుకుగాను వినూత్నమైన రీతిలో నిరసనలు తెలుపుతున్నామన్నారు. తక్షణమే ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంటు విజయ్, కోశాధికారి ప్రసాద్, అంజయ్య, రమేష్, రాజన్న ప్రభురవికిరణ్, రవిగౌడ్, అంబదాస్ రావు, భూపేందర్, యూసుఫ్ అలీ, అంబాధస్ రావు, పవిత్రాన్ తదితరులు పాల్గొన్నారు.

ఐటీ మంత్రిని కలిసి సన్మానించిన నిజామాబాద్ బ్రాహ్మణ సంఘం



మంత్రిని సన్మానిస్తున్న బ్రాహ్మణసంఘం సభ్యులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షులు కిరణ్ దేశ్‌ముఖ్ ఆధ్వర్యంలో హైదరాబాద్ లో తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖామాత్యులు బ్రాహ్మణ ముద్దు బిడ్డ దుద్దిల్ల శ్రీధర్‌బాబుని కలిసి బుధవారం ఘనంగా సన్మానించారు. నిజామాబాద్ బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు కిరణ్ దేశ్ ముఖ్ మంత్రికి విజ్ఞప్తి చేస్తూ నిజామాబాద్ నగరంలో బ్రాహ్మణులకు స్థలం ఇప్పించి బ్రాహ్మణ భవనం, వేద పాఠశాల ప్రభుత్వం ద్వారా ఏర్పాటు చేయించాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి శ్రీధర్‌బాబు సానుకూలంగా స్పందించి బ్రాహ్మణ భవన నిర్మాణానికి తనవంతు కృషి చేస్తానని వివేకానంద ఓవర్‌సీస్ కింద సాంక్షన్ అయిన స్కాలర్షిప్‌లను కూడా వెంటనే విడుదల చేయించే ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి రొట్టె సురేష్ శర్మ, కోశాధికారి పుల్కల్ రమేష్, సభ్యులు జయంత్ రావు, కోస్లి చంద్రశేఖర్, లక్ష్మి నారాయణ భరద్వాజ్, తదితరులు పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి

- ఈజీఎస్ అటెండర్స్, కంప్యూటర్ ఆపరేటర్లు
- కాంగ్రెస్ సీనియర్ నాయకులు జగ్గారెడ్డికి వినతి

నవతెలంగాణ-ఎడపల్లి

జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లకు ఎంసీసీలకు సమాన పనికి సమాన వేతనం రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేయాలని కోరుతూ. మండల, జిల్లా, రాష్ట్ర అధ్యక్షులు. బుధవారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జగ్గారెడ్డిని హైదరాబాదులో కలిశారు. సమస్యలను పరిష్కరిం చేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఈజీఎస్ అటెండర్స్ ల రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవ్ మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో 540 మంది ఎంపీడీఓ ఆఫీస్ ఈజీఎస్‌లో ఎంసీసీ అటెండర్స్‌గా పని చేస్తున్నప్పటికీ సరిపడా వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్నామని, తమకు న్యాయం చెయ్యాలని జగ్గారెడ్డిని కోరారు. ప్రస్తుతం వేతనాలను ఇస్తున్నారని మాధవ్ జగ్గారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సానుకూలంగా స్పందించి సమస్య గురించి పంచాయతీరాజ్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్తానని జగ్గారెడ్డి హామీఇచ్చినట్టు చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని మాధవ్ తెలిపారు.




వినతిపత్రం అందజేస్తున్న ఈజీఎస్ అటెండర్స్, కంప్యూటర్ ఆపరేటర్లు

డిచ్‌పల్లి ఇంచార్జీ ఎంపీడీవోగా శ్రీనివాస్ గౌడ్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా రవీందర్ ఆరు నెలల సెలవులపై వెళు తున్నందున ఎంపిఓ గా ఉన్న శ్రీనివాస్ గౌడ్ గురువారం నుండి ఇంచార్జీ మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తారని మండల పరిషత్ కార్యాలయం బుధవారం తెలిపింది. మండలంపై పట్టు ఉన్న శ్రీనివాస్‌గౌడ్‌కు ఇంచార్జీ భాధ్యతలను అప్పగించడంతో కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ చట్టం సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తు శుభాకాంక్షలు తెలిపారు.



సన్మానిస్తున్న సిబ్బంది

గ్రామస్తులకు భగవద్గీత పుస్తకాల వితరణ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని ఉప్లూర్ గ్రామస్తులకు బుధవారం గీతా జయంతి సందర్భంగా జగిత్యాల జిల్లా మెట్ పల్లి మండలం పెద్దాపూర్ గ్రామానికి చెందిన ప్రభుజిలు రాజేందర్, కాశన్న భగవద్గీత పుస్తకాలను వితరణ చేశారు. స్థానిక శ్రీ బాల రాజరాజేశ్వర స్వామి ఆలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో గ్రామ ప్రముఖులకు, ప్రజలకు గీతా జయంతి సందర్భంగా భగవద్గీత పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ రేగుంట దేవేందర్, టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బద్దం చిన్నారెడ్డి, గ్రామ ప్రముఖులు నల్ల మోహన్ రెడ్డి, మూల భూమన్న, బద్దం భాస్కర్, ఎనేడ్ల బాజిరెడ్డి, గోపిడి శంకర్, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు సోమ దశరత్, పాలేపు మురళి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు పిప్పేరా అనిల్ రెడ్డి పాల్గొన్నారు.

కారు, బైక్ ఢీకొని ఒకరి మృతి

నవతెలంగాణ-బోధన్

సాలురా మండలం సాలూర క్యాంప్ వద్ద బైపాస్ రహదారిపై బుధవారం కారు బైక్‌ను ఢీకొనడంతో మహారాష్ట్రకు చెందిన వ్యక్తి సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్ రెడ్డి తెలిపిన వివరాలు ప్రకారం.. మహారాష్ట్ర కొండలవాడి సమీపంలోని దౌలాపూర్ గ్రామానికి చెందిన షేక్ మహబూబ్(42) తన సోదరుని కుమారుని వివాహానికి సంబంధించిన బట్టల కోసం వారి బంధువులతో బోధన్‌కు బైక్‌పై వస్తుండగా సాలూరు క్యాంప్ వద్ద అంతర్రాష్ట్ర బైపాస్ రహదారిపై ఎదురుగా వస్తున్న కారు అతివేగంగా వచ్చి అపసవ్య దిశలో ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగిందని ఎస్ఐ తెలిపారు. దాంతో బైక్ నడుపుతున్న షేక్ మహబూబ్ ఘటన స్థలంలోనే మృతి చెందగా, ఆయనతో ఉన్న రషీద్‌కు తీవ్ర గాయాలు అయ్యాయని ఎస్ఐ తెలిపారు. కారులోని వారు మహారాష్ట్ర దెగ్లూర్‌కు వెళు తున్న క్రమంలో ఈ ప్రమాదం జరిగింది. సంఘటన స్థలానికి చేరుకున్న బోధన్ రూరల్ పోలీసులు పంచనామా నిర్వహించి మృతుని సోదరుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై తెలిపారు. డ్రైవర్ షేక్ దావూద్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. పెళ్లికి సంబంధించిన పనుల్లో అంతా నిమగ్నమయిన వేళ ఈ ప్రమాదం జరగడంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.



ఘటనా స్థలంలో మృతదేహం వద్ద రోధిస్తున్న కుటుంబీకులు

ఘనంగా అయ్యప్ప స్వామి పడిపూజ

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని టీచర్స్ కాలనీలో మంగళవారం రాత్రి కాంగ్రెస్ పార్టీ బిసి సెల్ పట్టణ అధ్యక్షులు గురుస్వామి దోండి రమణ ఆధ్వర్యంలో గత కొన్ని సంవత్సరాలుగా అయ్యప్ప మహాపడిపూజ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ పూజ కొడుకు రణతేజ్ కన్నెస్వామితో నిర్వహించారు. అయ్యప్ప స్వాములు గురు స్వాములు కాలనీవాసులందరూ వచ్చి పూజ కార్యక్రమాలు నిర్వహించారు. నగేష్ శర్మ గురుస్వామి వేదమంత్రాలతో పూజ నిర్వహించారు. కార్యక్రమంలో రేగుళ్ల సత్యనారాయణ భజన బృందం మంత్రముగ్ధులను చేసింది. కార్యక్రమంలో పలువురు స్వాములు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి వృద్ధుడి మృతి

నవతెలంగాణ-నవీపేట్

మండల కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ స్కూల్ సమీపంలో రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధుడు పెద్ద సాయిలు (61) చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఎస్సై వినయ్ కుమార్ తెలిపారు. రెంజల్ మండలంలోని కల్యాపూర్ గ్రామానికి చెందిన సాయిలు టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై ఈనెల 5న నవీపేట్ కు వచ్చి తిరిగి వెళుతుండగా బస్సును ఢీకొని గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం నిజామాబాద్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి భార్య వీరలక్ష్మి ఫిర్యాదు మేరకు ఎస్సై వినయ్ కుమార్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వాహనాల తనిఖీ

నవతెలంగాణ-రెంజల్

మండలంకేంద్రంలోని పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్సై ఈ .సాయన్న వాహనాల విస్తృత తనిఖీలను చేపట్టారు. సిపి ఆదేశాల మేరకు గతంలో ఫైన్ విధించిన వాహనాలను తనిఖీ చేస్తూ డబ్బులను రికవరీ చేశారు. దీంతోపాటు ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ తప్పనిసరి ధరించాలని, చిన్నారులకు వాహనాలు ఇవ్వరాదని, వాహనాలకు సంబంధించిన పేపర్లను వారు తనిఖీ చేశారు. ప్రతి వాహనదారుడికి లైసెన్స్ తప్పని సరిగా ఉండాలని ఆయన వారికి ఆదేశించారు.